తరంగాలు

రిపోర్టర్లు కావలెను

అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి...

ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్

94949 23460



https://epaper.tharangalu.in

RNI. TELTEL / 2022 / 83463

జాతీయ దిన ప్రతిక

# తరంగాలు

Tharangalu Daily News Paper

ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
బుధవారం
29 ఏప్రిల్ 2026
సంపుటి 03
సంచిక 201
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh

Epaper: www.tharangalu.in.com


## ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం కీలకం: సీఎం



- మీర్ఖాన్‌పేటలో పోలీస్ కమిషనరేట్ భూమిపూజ
- భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులకు శ్రీకారం
- మావోయిస్టులకు లొంగిపోవాలంటూ పిలుపు
- సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 28తరంగాలు ప్రతినిధి రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం అత్యంత అవసరమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మీర్ఖాన్‌పేటలో భారత్ ఫ్యూచర్ సిటీ పరిధిలో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ భవన

మిగతా 2వ పేజిలో..




## నేడు పదో తరగతి ఫలితాలు విడుదల

- మధ్యాహ్నం 2 గంటలకు ఫలితాల ప్రకటన
- 5 లక్షలకు పైగా విద్యార్థుల ఉత్కంఠ
- వాట్సాప్ ద్వారా ఫలితాల తెలుసుకునే సదుపాయం

హైదరాబాద్, ఏప్రిల్ 28తరంగాలు ప్రతినిధి తెలంగాణలో పదో తరగతి పరీక్ష ఫలితాల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులకు శుభవార్త. రాష్ట్రంలో పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాలు నేడు(బుధవారం ) విడుదల

మిగతా 2వ పేజిలో..

## ఇంధన సంక్షోభం

- తెలుగు రాష్ట్రాల్లో బంకుల వద్ద భారీ క్యూలు
- చమురు సరఫరాలో అంతరాయం - ఆందోళనలో సామాన్యులు
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల అత్యవసర సమీక్ష
- వదంతులు నమ్మవద్దన్న పౌరసరఫరాల శాఖ అధికారులు




డెస్క్, ఏప్రిల్ 28 తరంగాలు ప్రతినిధి గత రెండు రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీ యంగా ముడిచమురు ధరలు పెరగడం, సరఫరా గొలుసులో తలెత్తిన సాంకేతిక సమస్యల వల్ల ఈ పరిస్థితి తలెత్తినట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, ఏలూరు, కర్నూలు వంటి నగరాల్లో అనేక చోట్ల 'నో స్టాక్' బోర్డులు దర్శనమిస్తుండటంతో వాహనదారులు బంకుల వద్ద గంటల తరబడి వేచి

మిగతా 2వ పేజిలో..



## మాజీ మావోయిస్టులకు కొత్త జీవితం

- గిరిదర్శకులుగా నియామకం
- సీఎం చేతుల మీదుగా నియామక పత్రాల అందజేత
- పర్యాటక రంగంలో గిరిజన యువతకు అవకాశం
- సమాజంలో భాగస్వామ్యం దిశగా వినూత్న చర్య

హైదరాబాద్, ఏప్రిల్ 28తరంగాలు ప్రతినిధి అజ్ఞాతం వీడి సాధారణ జీవితంలోకి రావాలనుకునే మాజీ మావోయిస్టులకు కొత్త అవకాశాలను కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం వినూత్న నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో 20 మంది మాజీ మావోయిస్టు గిరిజన యువకులను గిరిదర్శకులుగా నియమించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా వారికి నియామక పత్రాలు అందజేశారు.

ఈ కార్యక్రమం భారత్ ఫ్యూచర్ సిటీ పరిధిలో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ భూమి పూజ సందర్భంగా జరిగింది. గిరిజన యువతకు స్థిర జీవనోపాధి కల్పించాలనే ఉద్దేశంతో వారికి శిక్షణ ఇచ్చి పర్యాటక శాఖ ఆధ్వర్యంలో టూరిస్ట్ గైడ్లుగా నియమించారు. పోలీసు, గిరిజనాభివృద్ధి, పర్యాటక, అటవీ, దేవాదాయ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులకు

మిగతా 2వ పేజిలో..

# రక్షణ ఖర్చుల్లో భారత్‌కు ఐదో స్థానం

- ప్రపంచవ్యాప్తంగా సైనిక వ్యయం పెరుగుదల
- అగ్రస్థానంలో అమెరికా
- యూరప్ ప్రభావం స్పష్టంగా వెల్లడి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 28తరంగాలు ప్రతినిధి ప్రపంచ దేశాల్లో రక్షణ రంగంపై అత్యధికంగా ఖర్చు చేస్తున్న దేశాల జాబితాలో భారత్ ఐదో స్థానంలో నిలిచింది. గడిచిన 2025 సంవత్సరంలో భారత్ సుమారు 92.1 బిలియన్ డాలర్లను రక్షణ రంగానికి కేటాయించింది. అమెరికా, చైనా, రష్యా, జర్మనీ దేశాలు భారత్ కంటే ముందు స్థానాల్లో ఉన్నట్లు తాజా నివేదిక వెల్లడించింది. ఈ వివరాలను స్వీడన్ దేశానికి చెందిన స్టాక్‌హోమ్ అంతర్జాతీయ శాంతి పరిశోధన సంస్థ విడుదల చేసింది. ఆ నివేదిక ప్రకారం 2025లో ప్రపంచవ్యాప్తంగా రక్షణ వ్యయం 2.9 శాతం పెరిగి 2,887 బిలియన్ డాలర్లకు చేరింది. ప్రపంచ దేశాలు భద్రతా అవసరాలను దృష్టిలో ఉంచుకుని తమ సైనిక ఖర్చులను పెంచుతున్నట్లు వెల్లడైంది. భారత్ రక్షణ వ్యయం 2024తో పోలిస్తే 8.9 శాతం పెరిగి 92.1 బిలియన్ డాలర్లకు చేరింది. దీని ద్వారా ప్రపంచంలో అత్యధికంగా రక్షణ రంగంపై ఖర్చు చేస్తున్న దేశాల్లో భారత్ ఐదో స్థానాన్ని సంపాదించింది. దేశ భద్రతా అవసరాలు, సాంకేతిక ఆధునీకరణ చర్యలు ఈ పెరుగుదలకు కారణమని నిపుణులు చెబుతున్నారు.

అమెరికా 954 బిలియన్ డాలర్ల వ్యయంతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. చైనా 336 బిలియన్ డాలర్లతో రెండో స్థానంలో ఉంది. ఉక్రెయిన్ యుద్ధం ప్రభావంతో రష్యా 190 బిలియన్ డాలర్ల ఖర్చుతో మూడో స్థానంలో నిలిచింది. జర్మనీ 114 బిలియన్ డాలర్లతో నాలుగో స్థానంలో నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా సైనిక వ్యయం పెరగడంలో యూరప్ కీలక పాత్ర పోషించినట్లు నివేదిక వెల్లడించింది. యూరప్ దేశాలు తమ రక్షణ వ్యయాన్ని 14 శాతం పెంచి మొత్తం 864 బిలియన్ డాలర్లకు తీసుకెళ్లాయి. భద్రతా పరిస్థితుల మార్పు ఈ పెరుగుదలకు ప్రధాన కారణంగా పేర్కొన్నారు.పాకిస్తాన్

మిగతా 2వ పేజిలో..



## సిక్కింలో పిల్లలతో ఫుట్‌బాల్ ఆడిన ప్రధాని

- గ్యాంగ్‌టాక్‌లో సరదాగా గడిపిన మోదీ
- సామాజిక మాధ్యమాల్లో వీడియోలు పంచుకున్న ప్రధాని

2వ పేజిలో..



## హైదరాబాద్‌ను ప్రపంచ వైద్య పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

- మంత్రి దామోదర్ రాజనర్సింహా..

2వ పేజిలో..

## ఎండల దెబ్బకు విద్యుత్తు వినియోగం రికార్డు స్థాయికి

- హీట్‌వేవ్ ప్రభావంతో దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుదల
- ఒక్క రోజులోనే గరిష్ట వినియోగం నమోదు
- రానున్న రోజుల్లో మరింత పెరుగుదల సూచనలు



2వ పేజిలో..

# ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం కీలకం: సీఎం

➢ మొదటి పేజీ తరువాయి

నిర్మాణానికి ఆయన భూమిపూజ నిర్వహించారు. ఇదే సందర్భంగా గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు శంకుస్థాపన చేసి, మల్కాజిగిరి కమిషనరేట్ భవనం, ఆక్టోపస్ పరిపాలనా బ్లాక్, కుత్బుల్లాపూర్ డీసీపీ కార్యాలయాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ప్రజా ప్రతినిధులు, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఫ్యూచర్ సిటీని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలంటే సర్పంచులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు అందరూ కలిసి పనిచేయాలని సూచించారు.

### - అభివృద్ధి ఫలాలు అందరికీ

ఫ్యూచర్ సిటీ పరిధిలోకి తమ గ్రామాలను చేర్చాలని కోరుతున్న ప్రాంతాల ప్రజలకు గ్రామసభలు నిర్వహించి తీర్మానాలు పంపాలని సూచించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఈ ప్రాంతాన్ని పెట్టుబడులకు అనువైన కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో గ్లోబల్ సమ్మిట్ నిర్వహించామని తెలిపారు. జూన్ 2 నాటికి ఫ్యూచర్ సిటీ కార్యాలయం నిర్మాణాన్ని పూర్తి చేసి అక్కడి నుంచే కార్యకలాపాలు ప్రారంభిస్తామని వెల్లడించారు.

### - మౌలిక వసతుల విస్తరణ

హైదరాబాద్‌లో గతంలో ప్రతిపాదించిన హైటెక్ సిటీ, అవుటర్ రింగ్ రోడ్, అంతర్జాతీయ విమానాశ్రయం లాంటి ప్రాజెక్టులు విజయవంతమైనట్లు గుర్తుచేశారు. ఫ్యూచర్ సిటీలో బుల్లెట్ ట్రైన్ హబ్, మెట్రో రైలు, భారీ బస్ టర్మినల్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. భూములు ఇచ్చే ప్రజలకు తగిన పరిహారం, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా శిక్షణ అందిస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి కోసం భూములు ఇచ్చే వారిని గౌరవించాలని అధికారులకు సూచించారు.

### మావోయిస్టులకు పిలుపు

అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు లొంగిపోవాలని సీఎం పిలుపునిచ్చారు. ముఖ్యంగా అగ్రనేత గణపతి ఆరోగ్యం బాగోలేదని సమాచారం ఉందని, లొంగిపోతే అవసరమైన వైద్యం, భద్రత కల్పిస్తామని తెలిపారు.ఇప్పటికే 2024 నుంచి 800 మందికి పైగా నక్సలైట్లు జనజీవన స్రవంతిలో కలిసినట్లు వెల్లడించారు. వారిని ఆర్థికంగా ఆదుకుని అభివృద్ధిలో భాగస్వాములను చేస్తామని పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు అయితేనే నిజమైన ప్రగతి సాధ్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## రక్షణ ఖర్చుల్లో భారత్‌కు ఐదో స్థానం

➢ మొదటి పేజీ తరువాయి

కూడా తన రక్షణ వ్యయాన్ని పెంచింది. 11.9 బిలియన్ డాలర్ల ఖర్చుతో ఆ దేశం జాబితాలో 31వ స్థానంలో నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో రక్షణ రంగంపై ఖర్చులు మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు.

# ఇంధన సంక్షోభం

చూడాల్సి వస్తోంది. పరిస్థితిని గమనించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి మూడు గంటలకోసారి నివేదికలు పంపాలని అధికారులను ఆదేశించారు.మరోవైపు తెలంగాణలో కూడా కొన్ని ప్రాంతాల్లో ఇంధన కొరతపై వదంతులు వ్యాపించడంతో ప్రజలు భయాందోళనలకు గురై బంకుల వద్ద క్యూ కడుతున్నారు. హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో పెట్రోల్ బంకుల వద్ద వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. అయితే, తెలంగాణ పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఈ వార్తలను ఖండించారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ నిల్వలు సరిపడా ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెంది ఒకేసారి పెద్ద మొత్తంలో కొనుగోలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, అనవసరంగా నిల్వ చేయడం వల్ల కృత్రిమ కొరత ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. చమురు మార్కెటింగ్ కంపెనీల ప్రతినిధుల ప్రకారం, డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా చేయడంలో కొన్ని రవాణా పరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా వ్యవసాయ సీజన్ కావడం వల్ల డీజిల్ వినియోగం పెరగడం కూడా ఈ ఒత్తిడికి ఒక కారణం. ఆంధ్రప్రదేశ్ పెట్రోలియం అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, చమురు కంపెనీలు సరైన సమయానికి స్టాక్ పంపకపోవడం వల్ల కొన్ని బంకులు మూసివేయాల్సి వచ్చిందని తెలిపారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు చమురు కంపెనీలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, రాబోయే 24 నుండి 48 గంటల్లో పరిస్థితి సాధారణ స్థితికి వస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.కొరత దృష్ట్యా కొన్ని చోట్ల పెట్రోల్ బంకుల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కేవలం వాహనాల్లో ఉన్న ట్యాంకులకు మాత్రమే ఇంధనం పోయాలని, బాటిళ్లు లేదా క్యాన్లలో పోయవద్దని నిబంధనలు విధించారు. దీనివల్ల నల్లబజారులో ఇంధనం విక్రయించడాన్ని అరికట్టవచ్చని భావిస్తున్నారు. కర్నూలు వంటి జిల్లాల్లో కలెక్టర్లు స్వయంగా బంకులను తనిఖీ చేసి, నిల్వలను పరిశీలిస్తున్నారు. కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలతో నెమ్మదిగా సరఫరా మెరుగుపడుతోందని సమాచారం. ఈ సమస్య కేవలం రవాణా, తాత్కాలిక డిమాండ్ వల్ల కలిగిందేనని, శాశ్వత కొరత కాదని నిపుణులు విశ్లేషిస్తున్నారు. రవాణాదారులు తమ సేవలను వేగవంతం చేస్తే ఈ ఇబ్బందులు త్వరలోనే తొలగిపోతాయి. ప్రజలు సంయమనం పాటించి, అవసరమైన మేరకే ఇంధనం కొనుగోలు చేయడం వల్ల ఇతరులకు కూడా ఇబ్బంది కలగకుండా ఉంటుంది. రెండు రాష్ట్రాల్లోని పౌరసరఫరాల శాఖలు చమురు కంపెనీల డిపోల నుండి నిరంతరం స్టాక్ మూవ్‌మెంట్‌ను పర్యవేక్షిస్తున్నాయి. వచ్చే రెండు రోజుల్లో అన్ని బంకుల్లో ఇంధనం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

## మాజీ మావోయిస్టులకు కొత్త జీవితం

➢ మొదటి పేజీ తరువాయి

సహాయం చేసే విధంగా ప్రత్యేక శిక్షణ అందించారు.

### పర్యాటకులకు మార్గదర్శకులుగా సేవలు

తొలి విడతలో ఎంపికైన 20 మంది గిరిజన యువత ప్రధానంగా భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లోని పర్యాటక ప్రాంతాల్లో విధులు నిర్వహించనున్నారు. స్థానిక సంస్కృతి, చరిత్ర గురించి పర్యాటకులకు వివరించడంతో పాటు అటవీ నియమాలను పాటించేలా అవగాహన కల్పిస్తారు. అలాగే పర్యాటకులకు భద్రత కల్పించడంలో కూడా ఈ గిరిదర్శకులు కీలక పాత్ర పోషిస్తారని అధికారులు తెలిపారు. ప్రత్యేక యూనిఫామ్‌లతో విధులు నిర్వహించే వీరు పర్యాటక రంగానికి కొత్త ఆకర్షణగా నిలవనున్నారు.

### అభివృద్ధి దిశగా కీలక అడుగు

గతంలో తీవ్రవాద ప్రభావం ఉన్న ప్రాంతాల్లో అభివృద్ధిని వేగవంతం చేయడమే కాకుండా గిరిజన యువతను సమాజంలో భాగస్వామ్యం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ప్రభుత్వం తెలిపింది. ఒకప్పుడు మావోయిస్టులకు దారి చూపిన యువకులు ఇకపై పర్యాటకులకు మార్గదర్శకులుగా మారడం ప్రత్యేకతగా నిలుస్తోంది.ఈ సందర్భంగా గిరిదర్శకులకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో ఆరు నెలల పాటు సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. శిక్షణ కాలంలో వారికి స్కాలర్‌షిప్ అందించాలన్నారు. సమాజంలో ప్రధాన ప్రవాహంలోకి గిరిజన యువతను తీసుకువచ్చే దిశగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం సానుకూల ఫలితాలు ఇస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## నేడు పదో తరగతి ఫలితాలు విడుదల

➢ మొదటి పేజీ తరువాయి

కానున్నాయి. మధ్యాహ్నం 2 గంటలకు విద్యాశాఖ అధికారులు అధికారికంగా ఫలితాలను ప్రకటించనున్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. ఈ ఏడాది మార్చి 14 నుంచి ఏప్రిల్ 13 వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5.15 లక్షల మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఏప్రిల్ 23 నాటికే జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తయింది. ముందుగా మే మొదటి వారంలో ఫలితాలు ప్రకటించాలని భావించినప్పటికీ, గడువుకు ముందుగానే విడుదల చేయడం విశేషంగా మారింది.

విద్యార్థులకు సులభతరం చేయడానికి ఈసారి కొత్త సాంకేతిక సదుపాయాన్ని ప్రవేశపెట్టారు. వాట్సాప్ ద్వారా ఫలితాలను తెలుసుకునే అవకాశం కల్పించారు. ఇప్పటికే హాల్‌టికెట్లను వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకున్న విద్యార్థులకు ఫలితాల మెమో నేరుగా మొబైల్‌కు చేరనుంది.

ఇంకా ఆ సదుపాయం వినియోగించుకోని విద్యార్థులు కూడా సులభంగా ఫలితాలను తెలుసుకోవచ్చు. ఇందుకోసం 80969 58096 నంబర్‌కు 'ఎఱ' అని సందేశం పంపాలి. ఆ తర్వాత 'ఆూజ =వంబశ్రీం' ఎంపికను ఎంచుకుని, హాల్‌టికెట్ నంబర్ నమోదు చేస్తే ఫలితం వెంటనే ఫోన్ స్క్రీన్‌పై కనిపిస్తుంది. ఈ విధానం ద్వారా సర్వర్ల రద్దీ సమస్య లేకుండా వేగంగా ఫలితాలను పొందే అవకాశం ఉంది. విద్యార్థులు ఎక్కడ ఉన్నా సులభంగా తమ ఫలితాలను తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఫలితాల ప్రకటనతో విద్యార్థుల ఉత్కంఠకు తెరపడనుంది. తదుపరి విద్యా అవకాశాలపై నిర్ణయాలు తీసుకునేందుకు ఇది కీలక దశగా నిలవనుంది.

# సిక్కింలో పిల్లలతో ఫుట్‌బాల్ ఆడిన ప్రధాని

- గ్యాంగ్‌టాక్‌లో సరదాగా గడిపిన మోదీ
- యువతతో క్రీడల్లో పాల్గొని ఉత్సాహం
- సామాజిక మాధ్యమాల్లో వీడియోలు పంచుకున్న ప్రధాని



గ్యాంగ్‌టాక్, ఏప్రిల్ 28 సిక్కిం పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గ్యాంగ్‌టాక్‌లో పిల్లలతో కలిసి ఫుట్‌బాల్ ఆడి ఆకట్టుకున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఇవాళ ఉదయం ఆయన బాలబాలికలతో కలిసి మైదానంలోకి దిగారు. అమ్మాయిలు, అబ్బాయిలు సమానంగా పాల్గొనగా, ఆట ఉత్సాహభరితంగా సాగింది. పిల్లలతో కలిసి ఆటలో పాల్గొన్న మోదీ ఎంతో ఆనందంగా గడిపినట్లు తెలిపారు. ఫుట్‌బాల్ మ్యాచ్ సందర్భంగా గోల్‌పోస్ట్ వద్ద నిలబడి గోల్ కొట్టేందుకు ప్రయత్నించిన దృశ్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంలో పిల్లలలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు మానసిక ధైర్యాన్ని పెంచే సందేశాన్ని కూడా ఆయన అందించారు.ఈ కార్యక్రమానికి సంబంధించిన చిత్రాలు, వీడియోలను మోదీ తన సామాజిక మాధ్యమ ఖాతాలో పంచుకున్నారు. సిక్కింలో యువతతో కలిసి ఫుట్‌బాల్ ఆడటం ఎంతో ప్రత్యేక అనుభవమని ఆయన పేర్కొన్నారు. యువతలో ఉన్న ఉత్సాహం, శక్తి తనకు ప్రేరణనిచ్చిందని తెలిపారు. క్రీడల ద్వారా ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు క్రమశిక్షణ, జట్టు భావన పెరుగుతుందని ప్రధాని సూచించారు. పిల్లలు చదువుతో పాటు క్రీడలకు కూడా సమయం కేటాయించాలని ఆయన ప్రోత్సహించారు.

సిక్కిం పర్యటనలో భాగంగా స్థానిక సంస్కృతి, ప్రజల జీవన విధానాన్ని కూడా ఆయన తెలుసుకున్నారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజలతో మమేకమవుతున్నారు. యువతతో కలిసి క్రీడల్లో పాల్గొనడం ద్వారా నాయకులు సమాజానికి సానుకూల సందేశాన్ని ఇవ్వగలరని ఈ ఘటన మరోసారి నిరూపించింది.

# హైదరాబాద్‌ను ప్రపంచ వైద్య పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

- మంత్రి దామోదర్ రాజనర్సింహ
- జూన్‌లో అంతర్జాతీయ మెడికల్ టూరిజం ఈవెంట్ నిర్వహణ
- విదేశీ ప్రతినిధులకు ఆహ్వానం.. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల సందర్శన
- ప్రతి ఏడాది మెడికల్ టూరిజం ఈవెంట్ నిర్వహణకు ప్రభుత్వం నిర్ణయం

హైదరాబాద్, ఏప్రిల్ 28 హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి వైద్య పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పంతో ముందుకు సాగుతోందని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఈ దిశగా జూన్ నెలలో అంతర్జాతీయ మెడికల్ టూరిజం ఈవెంట్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సెక్రటేరియట్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ వైద్య పర్యాటక రంగం ద్వారా రాష్ట్రానికి ఆర్థిక లాభాలతో పాటు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. ఈవెంట్‌ను విజయవంతం చేయడానికి పర్యాటక శాఖతో సమన్వయం చేసుకొని సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఈ అంతర్జాతీయ ఈవెంట్‌లో దేశీయ, విదేశీ వైద్య, ఫార్మా రంగ నిపుణులను భాగస్వామ్యం చేయాలని మంత్రి తెలిపారు. ఆఫ్రికా, ఆసియా, మధ్యప్రాచ్య దేశాల నుంచి ప్రతినిధులను ఆహ్వానించి హైదరాబాద్ వైద్య రంగ సామర్థ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయాలని అన్నారు.

ప్రతినిధులు హైదరాబాద్‌లోని ప్రముఖ ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులతో పాటు ప్రభుత్వ ఆస్పత్రులను కూడా సందర్శించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నిమ్స్, టిమ్స్, ఉస్మానియా, గాంధీ వంటి ఆస్పత్రుల్లో అందిస్తున్న వైద్య సేవలను ప్రత్యక్షంగా చూపించాలని సూచించారు. ముఖ్యంగా టిమ్స్ ఆస్పత్రుల్లో అంతర్జాతీయ రోగుల కోసం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసి, ఒక్కో ఆస్పత్రిలో కనీసం 50 పడకలతో ప్రత్యేక వార్డులు ఏర్పాటుచేయాలని మంత్రి ఆదేశించారు. విదేశీ రోగులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందడం ద్వారా ఆదాయం పెరిగి, ఆ నిధులను తిరిగి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వినియోగించవచ్చని మంత్రి అభిప్రాయపడ్డారు. ఈవెంట్‌ను ఒకసారి మాత్రమే కాకుండా ప్రతి ఏడాది నిర్వహించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని వెల్లడించారు.

### నర్సింగ్ ఆఫీసర్ల నియామకాలకు సిద్ధం

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న 2322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తయిందని మంత్రి తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు మే 12న అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా నియామక పత్రాలు అందజేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ నియామకాలతో ఆస్పత్రుల్లో సిబ్బంది కొరత సమస్య కొంతవరకు తీరుతుందని అన్నారు.

### వైద్య పోస్టుల భర్తీపై సమీక్ష

ప్రభుత్వ ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీపై కూడా మంత్రి సమీక్ష నిర్వహించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీని వచ్చే నెల 15 నాటికి పూర్తి చేసి ఫలితాలు ప్రకటించాలని అధికారులకు సూచించారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్, ఫార్మసిస్ట్, మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ పోస్టుల భర్తీలో ఉన్న చట్టపరమైన సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.గత రెండేళ్లలో సుమారు 12,650 పోస్టులను భర్తీ చేసినట్లు మంత్రి తెలిపారు. మిగిలిన పోస్టుల భర్తీ పూర్తయితే రాష్ట్ర ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందుతాయని చెప్పారు. రాష్ట్రంలో వైద్య రంగాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు

# ఎండల దెబ్బకు విద్యుత్తు వినియోగం రికార్డు స్థాయికి

- హీట్‌వేవ్ ప్రభావంతో దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుదల
- ఒక్క రోజులోనే గరిష్ట వినియోగం నమోదు
- రానున్న రోజుల్లో మరింత పెరుగుదల సూచనలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28 దేశవ్యాప్తంగా హీట్‌వేవ్ ప్రభావం కొనసాగుతోంది. ఎండలు తీవ్రంగా ఉండటంతో చాలా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయి. పగటి వేళల్లో వేడి తట్టుకోలేని స్థాయికి చేరుకోవడంతో ప్రజలు ఎయిర్ కండీషనర్లు, డెజర్ట్ కూలర్లు అధికంగా వినియోగిస్తున్నారు. ఈ పరిస్థితి విద్యుత్తు వినియోగంపై కూడా స్పష్టంగా ప్రభావం చూపుతోంది. సోమవారం ఒక్క రోజే దేశవ్యాప్తంగా గరిష్టంగా 255.85 గిగావాట్ల విద్యుత్తు వినియోగం నమోదైనట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. విద్యుత్తు శాఖ గణాంకాల ప్రకారం ఏప్రిల్ 27న సుమారు 256 గిగావాట్ల విద్యుత్తు వినియోగం జరిగింది. వేసవి తీవ్రత పెరిగే కొద్దీ విద్యుత్తు అవసరం కూడా పెరుగుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

ఈ నెలలో విద్యుత్తు వినియోగం క్రమంగా పెరుగుతూ వస్తోంది. ముఖ్యంగా నెల రెండో భాగం నుంచి వినియోగం మరింతగా పెరిగింది. శుక్రవారం 252.07 గిగావాట్లు, శనివారం 256.11 గిగావాట్ల వినియోగం నమోదైనట్లు సమాచారం. అయితే ఆదివారం రోజు వినియోగం కొంత తగ్గి 238.15 గిగావాట్లకు చేరింది. ఆదివారం రోజున వాణిజ్య సంస్థలు, పారిశ్రామిక యూనిట్లు సెలవు ఉండటంతో విద్యుత్తు వినియోగం తగ్గినట్లు అంచనా వేస్తున్నారు. అదేవిధంగా కొన్ని ప్రాంతాల్లో ధూళి తుఫానులు, వర్షాలు కురవడం కూడా వినియోగం తగ్గడానికి కారణమైంది. అయినప్పటికీ మొత్తం మీద విద్యుత్తు అవసరం అధికంగానే కొనసాగుతోంది.

గత సంవత్సరాలతో పోలిస్తే ఈ ఏడాది వినియోగం మరింత ఎక్కువగా నమోదవుతోంది. 2025 జూన్‌లో ఒక రోజు 242.77 గిగావాట్లు, 2024 మేలో 250 గిగావాట్లు, 2023 సెప్టెంబరులో 243.27 గిగావాట్ల వినియోగం నమోదైంది. ఈ గణాంకాలతో పోలిస్తే ప్రస్తుతం నమోదవుతున్న వినియోగం రికార్డు స్థాయికి చేరుతోంది. ఈ వేసవిలో ఎండలు మరింత తీవ్రంగా ఉండే అవకాశముందని వాతావరణ నిపుణులు ఇప్పటికే హెచ్చరించారు. ఈ నేపథ్యంలో విద్యుత్తు వినియోగం గరిష్టంగా 270 గిగావాట్లకు చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా సరఫరా కొనసాగించేందుకు విద్యుత్తు శాఖ ముందస్తు చర్యలు తీసుకుంటోంది.

జాతీయ దిన పత్రిక

తరంగాలు


## ఆర్యవైశ్య సంఘం నేత మృతి



**జఫర్గడ్ ప్రతినిధి, ఏప్రిల్ 28,(తరంగాలు):**
ప్రముఖ రైస్ మిల్లర్ , జిల్లా ఆర్యవైశ్య సంఘం సలహాదారులు గందె సీతారాములు (74) అనారోగ్య కారణములతో మంగళవారం మృతి చెందారు.జఫర్ గడ్ మండల కేంద్ర శివారు వడ్డేగూడెంకు చెందిన సీతారాములు గత కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురయి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గంగిశెట్టి ప్రమోద్ కుమార్ , చిట్టిమళ్ళ కృష్ణమూర్తి, మండల ఆర్యవైశ్య సంఘం నేతలు అంచూరి యుగందర్ ,దాంశెట్టి సోమన్న, ఇమ్మడి అశోక్ , బోనగిరి శ్రవణ్ కుమార్ ,రేవూరి శ్రీనివాస్, రేవూరి రమేష్ ,వివిధ పార్టీల నేతలు సీతారాములు మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేసారు.

## గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదుకు తక్షణమే స్పందించిన అధికారులు

- **సర్పంచ్- ఆబోతు శ్రీలత**

**తరంగాలు, ఏప్రిల్ :28, నర్సంపేట నియోజకవర్గ ప్రతినిధి**



ఖానాపురం మండలం పరిధిలోని మనుబోతుల గడ్డ గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలు ఎండ తీవ్రత తట్టుకోలేక ఉపాధి హామీ పనిచేయలేక ప్రజలకు ఉపయోగపడని పని చేస్తూ బాధపడుతున్నారని తెలుసుకున్న సర్పంచ్ కొద్ది రోజుల క్రితం గ్రీవెన్స్ సెల్ లో కలెక్టర్ కి ఫిర్యాదు చేయడం జరిగింది. ఉపాధి హామీ పథకాన్ని ప్రజలకు, రైతులకు ఉపయోగపడే విధంగా అమలు పరచాలని, తక్షణమే చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయగా తక్షణమే స్పందించిన కలెక్టర్ సర్పంచ్ కోరిన విధంగా ప్రజలకు, రైతులకు ఉపయోగపడే పనులను సాంక్షన్ ఇప్పించడం జరిగింది. ఫిర్యాదు అందిన వెంటనే తక్షణమే స్పందించిన కలెక్టర్ మరియు డిపిఓ, ఎంపీడీవో, మండల అధికారులకు సర్పంచ్ ఆబోతు శ్రీలత అశోక్ యాదవ్ ధన్యవాదాలు తెలియజేశారు.

## 25వ వార్డు సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- **నర్రా శ్రావణ్**



**మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, ఏప్రిల్.28, తరంగాలు:**
జిల్లా కేంద్రంలో మహబూబాబాద్ మున్సిపాలిటీలో 25వ వార్డు సమస్యలపై మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం ఇచ్చిన 25వ వార్డు కమిటీ కన్వీనర్ నర్రా శ్రావణ్. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు నర్రా శ్రావణ్ మాట్లాడుతూ గతంలో అనేకమందికి నీళ్ళు అందించిన పాత బావి వినియోగంలో లేక బావి చుట్టూ ధరలు కూలి చుట్టు ప్రక్కల ఉన్న కుటుంబాల ఇండ్లకు ప్రమాదక రంగ మారిందనీ, వెంటనే బావిలోని నీటికి బ్లీచింగ్ చల్లి బావి చుట్టూ కాంక్రీట్ తో కూడిన ఓడలు వేయాలని డిమాండ్ చేశారు. మరి అదే విధంగా 25 వార్డులోని నూతనంగా వేసిన విద్యుత్ స్తంభాలకు వీధి దీపాలు మరియు దానికి సంబంధించిన సామాగ్రిని సమకూర్చాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రం అందజేశారు .ఈ యొక్క కార్యక్రమంలో కమిటీ సభ్యులు మంద శంకర్, తండా శ్రీనాథ్ ,ఎండి రఫీ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర విద్య, న్యాయ సేవాధికారులకు అభినందనలు తెలిపిన తెలంగాణ ఉత్తమ పిఎల్ వి సతీష్ ఖండేల్వాల్

**ఇల్లందు ప్రతినిధి ఏప్రిల్ 28, (తరంగాలు):**



విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే న్యాయ అవగాహన పెంపొందించేందుకు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు సంఘసంస్కర్త తెలంగాణ రాష్ట్ర ఉత్తమ పారా లీగల్ వాలంటీర్ సతీష్ ఖండేల్వాల్ అభినందనలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాఠశాలలలో విద్యార్థులకు వారి హక్కులు, బాధ్యతలు, రాజ్యాంగ విలువలపై అవగాహన కల్పించాలని సదుద్దేశంతో ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు .ఈ మేరకు తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ,పాఠశాలల విద్యాశాఖా అధికారుల మధ్య కీలక అవగాహన ఒప్పందం కుదిరిందని ఈ ఒప్పందం ప్రకారం బాలల హక్కులు, బాల్యవివాహనిరోధక చట్టం, బాల కార్మిక చట్టాలు, ప్రాథమిక హక్కులు, పౌర బాధ్యతలపై అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు లీగల్ లిటరసీ క్లబ్బులు, చైల్డ్ రైట్స్ క్లబ్బులు ఏర్పాటు చేస్తున్నారని వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలోని అన్ని పాఠశాలలో న్యాయవిద్యను పూర్తి స్థాయిలో అమలు చేస్తారని దీనివల్ల బాల బాలికల్లో న్యాయం పై అవగాహన పెరిగి భవిష్యత్తులో మంచి పౌరులుగా తయారవుతారని పి ఎల్ వి సతీష్ ఖండేల్వాల్ వెల్లడించారు.ఈ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతం చేసేందుకు డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో పారా లీగల్ వాలంటీర్లు పాఠశాలలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్వహించే అవకాశం కలిగిస్తారని రాష్ట్ర విద్య, స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ అధికారులకు రాష్ట్ర ఉత్తమ పారా లీగల్ వాలంటీర్ సతీష్ ఖండేల్వాల్ కోరుతూ అభినందనలు తెలిపారు.

# చైల్డ్ సేఫ్టీ, ప్రొటెక్షన్ సే నో టు డ్రగ్స్ వీక్‌లో భాగంగా టీనేజ్ గర్భాధారణ, ఎల్లోప్మెంట్ కేసులపై అవగాహన



**తరంగాలు, ఏప్రిల్:28, నర్సంపేట నియోజకవర్గ ప్రతినిధి**

నర్సంపేట నియోజకవర్గం ఖానాపురం మండల కేంద్రంలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మహిళ శిశు సంక్షేమ శాఖ మరియు షేర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చైల్డ్ సేఫ్టీ మరియు ప్రొటెక్షన్ సే నో టు డ్రగ్స్ వీక్ లో భాగంగా టీనేజ్ గర్భాధారణ మరియు ఎల్లోప్మెంట్ కేసులపై అవగాహన కార్యక్రమం చైతన్య మండల సమైక్య భవనంలో సిడిపిఓ మధురిమ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి మండల అభివృద్ధి అధికారి డాక్టర్ వనపర్తి అద్వైత హాజరై మాట్లాడుతూ టీనేజ్ అనేది జీవితంలో చాలా సున్నితమైన దశ, ఈ వయసులో భావోద్వేగాలు ఎక్కువగా ఉంటాయి, కానీ సరైన అవగాహన, ఆలోచన అవసరమని కొంతమంది యువత ప్రేమను ఆకర్షణగా భావించి తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటారని అలాంటి నిర్ణయాల వల్ల టీనేజ్ గర్భాధారణ, ఎల్లోమెంట్ వంటి సమస్యలు ఏర్పడతాయని చిన్న వయసులో గర్భధారణ జరగడం వల్ల అమ్మాయి ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటుందని, బాల్యవివాహాలు, మత్తు పదార్థాల నిర్మూలన వాటి దుష్ప్రభావాలు, హెచ్ పి వి వ్యాక్సిన్ ప్రాముఖ్యత గురించి బాలికలకు వివరించడం జరిగింది. తహసీల్దార్ నంగునూరి రమేష్ మాట్లాడుతూ టీనేజ్లో సరియైన నిర్ణయాలు తీసుకోకపోతే చదువు మధ్యలో ఆగిపోవచ్చు భవిష్యత్తు లక్ష్యాలు నెరవేరకుండా పోవచ్చు అని అంతేకాకుండా చిన్న వయసులో తల్లిదండ్రుల బాధ్యతలు తీసుకోవడం చాలా కష్టం అన్నారు. కావున అందరూ క్రమశిక్షణగా చదువుకొని మంచి స్థానంలో ఉండాలని తెలియజేశారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ టీనేజ్లో మంచి పోషక ఆహారం తీసుకోవాలని శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండాలని లేకపోతే శారీరక బలహీనత, రక్తహీనత, రుతుస్రావ సంబంధం సమస్యలు మరియు గైనిక్ సమస్యలు వస్తాయని ఎల్లప్పుడూ పరిశుభ్రత పాటించి ఆరోగ్యంగా ఉండాలని తెలియజేశారు. స్థానిక సర్పంచ్ దాసరి రమేష్ మాట్లాడుతూ ఆడపిల్ల ఇంటికి మహాలక్ష్మి అని మగ పిల్లలకు ఏమి తక్కువ కాదని వారితో సమానంగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని క్రమశిక్షణగా చదువుకోవాలని పిలుపునిచ్చారు. ఏపీఎం రమాదేవి మాట్లాడుతూ చైతన్య మండల సమైక్య ఆధ్వర్యంలో బాలికలకు స్నేహ సంఘాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా టీనేజ్ పిల్లలకు శారీరక, మానసిక అవగాహన మరియు ప్రస్తుత పరిస్థితులకు అవగాహన మరియు చదువుకు సంబంధించిన విషయాలపై అవగాహన ద్వారా స్నేహ సంఘాలను బలోపేతం చేస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీసీలు కరుణ, పద్మ, నూరి నిషా బేగం, సూపర్వైజర్ రమ, షేర్ ప్రతినిధి జన్ను ప్రభాకర్, అంగన్వాడి టీచర్స్, స్నేహ సంఘాల బాలికలు పాల్గొన్నారు.




## చైల్డ్ సేఫ్టీ, నో టు డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం






- **ఎస్ హెచ్ ఓ - జి.రామ్మోహన్**

**తరంగాలు, ఏప్రిల్:28, నర్సంపేట నియోజకవర్గ ప్రతినిధి**

నర్సంపేట నియోజకవర్గం ఖానాపురం మండల పరిధిలోని అశోక్ నగర్ గ్రామంలో గల సైనిక్ స్కూల్ ఆవరణలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కమిషనర్ ఆఫ్ పోలీస్ సన్ ప్రీత్ సింగ్( ఐపీఎస్ ) ఆదేశాలతో విద్యార్థులకు చైల్డ్ సేఫ్టీ మరియు నో టు డ్రగ్స్ పై అవగాహన మరియు మత్తు పదార్థాల నిర్మూలన, వాటి దుష్ప్రభావాలు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మురళి నాయక్





**కేసముద్రం,మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, ఏప్రిల్.28, తరంగాలు:**
మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని దన్నసారి గ్రామం లో నూతన పిఎసిఎస్ సొసైటీ వారిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కొబ్బరికాయ కొట్టి రిబ్బన్ కట్ చేసే ప్రారంభించిన మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్,మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి,కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి బానోత్ సునీత వెంకన్న,వైస్ చైర్ పర్సన్ అల్లం రామ నాగేశ్వర్ రావు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక రైతులకు పెద్దపీట వేసిందని అంతేకాకుండా రైతులు పండించిన వారి దాన్యం పంటకు గిట్టుబాటు ధరతో పాటు బోనస్ ని కూడా ఇస్తుందని రైతు భరోసా నిధులు కూడా ఇస్తుందని అంతేకాకుండా రైతు సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు.రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు కేంద్రనికి తీసుకురావాలని ప్రభుత్వం ఇచ్చిన మద్దతు ధరకే అమ్ముకోవాలని అన్నారు.ఈ యొక్క ప్రజా ప్రభుత్వం రైతన్నలకు పెద్దపీట వేసింది కాబట్టి అలాకాకుండా దళారుల మాటలు నమ్మి రైతులు మోసపోవద్దని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దశ్రు నాయక్ ,బండారు వెంకన్న నీలం దుర్గేష్,వార్డ్ కౌన్సిలర్ కిషోర్,వీరష్ యాదవ్, మార్కెట్ డైరెక్టర్స్ చింతకుంట యాదగిరి,ఎం.డి. అయూబ్ ఖాన్, ధనసరి మాజీ ఉప సర్పంచ్ బానోత్ వెంకన్న, మహబూబాబాద్ జిల్లా యూత్ ఉపాధ్యక్షులు అల్లం గణేష్, సీఈవో మల్లారెడ్డి, ఏవో వెంకన్న,అధికారులు,సర్పంచ్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామస్తుల ప్రశంసలు అందుకుంటున్న గర్భిణీలకు సర్పంచ్ కిట్ కార్యక్రమం

- రఘునాథ్‌పల్లి గ్రామంలో గర్భిణీలకు సర్పంచ్ ఎడ్ల వెంకటయ్య దంపతుల సేవా కార్యక్రమం



**జఫర్గఢ్ ప్రతినిధి, ఏప్రిల్ 28, (తరంగాలు):**
మండలం లోని రఘునాథ్‌పల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ ఎడ్ల వెంకటయ్య ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీల కోసం ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ ఎడ్ల వెంకటయ్య ఆయన సతీమణి ఎడ్ల లీలావతి దంపతులు గ్రామంలోని ప్రతి ఒక్కరిని తమ కుటుంబ సభ్యులుగా భావిస్తూ అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలకు చీరలు, గాజులు, పండ్లు, ఐరన్ మాత్రలు "సర్పంచ్ కిట్" పేరుతో అవసరమైన వస్తువులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఎడ్ల వెంకటయ్య మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు తప్పనిసరిగా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవం చేయించుకోవాలని సూచించారు. "ప్రైవేట్ హాస్పిటల్ వద్దు – గవర్నమెంట్ హాస్పిటల్ ముద్దు" అనే సందేశాన్ని ఇచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో తాను వ్యక్తిగతంగా వాహనం పంపించి సహాయం చేస్తానని, అవసరమైతే ఆర్థికంగా కూడా ఆదుకుంటానని హామీ ఇచ్చారు.గ్రామంలోని ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది అందరూ గర్భిణీ స్త్రీలను ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే డెలివరీ చేయించేందుకు కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ఏపీఎం, సీసీ, సీఏ, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, గర్భిణీ స్త్రీలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పెట్రోల్ డీజిల్ గ్యాస్ కంపెనీల ప్రతినిధులు డీలర్లు సంబంధిత అధికారులతో సమావేశం

- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, ఏప్రిల్.28, తరంగాలు:**
మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో మహబూబాబాద్ జిల్లా హెచ్పిసిఎల్, బిపిసిఎల్, ఐఓసిఎల్ కంపెనీ ప్రతినిధులు, పెట్రోల్, డీజిల్ డీలర్లతో అదనపు కలెక్టర్ అనిల్ కుమార్, సంబంధిత అధికారులతో కలిసి డీజిల్, పెట్రోల్ కొరతపై సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్,ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా డీజిల్ ,పెట్రోల్ ,గ్యాస్ ఆయిల్ (ఇంధనాలను) అందించాలని, ప్రస్తుత డిమాండ్ కనుగుణంగా లభ్యతను స్వీకరించి సరఫరా చేయుటలో వేగం పెంచాలని సూచించారు, కృత్రిమ కొరత సృష్టించాలని చూస్తే చర్యలు తీసుకుంటామని, అధిక ప్రాధాన్యత వ్యవసాయ ఆధారిక వాహనాలు హార్వెస్టింగ్, ట్రాక్టర్ తదితర వాటికి ప్రాముఖ్యత కల్పించి ఇంధనాలు అందించాలని, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు కంపెనీ ప్రతినిధులు డీలర్లతో నిత్యం మాట్లాడుతూ సమస్యలు రాకుండా ఉత్పత్తులను అందించాలని ఆదేశించారు,పెట్రోల్ బంకులలో డబ్బాలలో డీజిల్ పెట్రోల్ తీసుకు వెళ్లడం రాదని, అవసరం లేకున్నా అధికంగా వినియోగించరాదని, సూచించారు ప్రభుత్వం అత్యంత వేగంగా డీజిల్ పెట్రోల్ సరఫరాకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలియజేశారు,పెట్రోల్ పంపుల వద్ద ఎలాంటి ఆందోళన పరిస్థితులు లేకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని సంబంధిత పెట్రోల్ పంపు యజమానులకు సూచించారు,ఈ సమావేశంలో పౌర సరఫరా శాఖ అధికారి రమేష్, ఆయిల్ కంపెనీ సెల్స్ ప్రతినిధులు ప్రణీత్, సౌమ్యదీప్, హరీష్ రాజ్, పెట్రోల్, డీజిల్, డీలర్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## 140వ మేడే పోరాట పోరాట వారసత్వాన్ని కొనసాగిద్దాం

- నాలుగు లేబర్ కోడుల రద్దుకై పోరాడుదాం




**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా,ప్రతినిధి, ఏప్రిల్. 28, తరంగాలు:**
కేసముద్రం మార్కెట్ యార్డు వద్ద ఐ ఎఫ్ టి యు హమాలి యూనియన్ కేసముద్రం ఏరియా అధ్యక్షులు బండి రాజు ఆధ్వర్యంలో 140 మే డే ను విజయవంతం చేయాలని కోరుతూ మేడే పోస్టర్ ను ఆవిష్కరణ చేయడం జరిగింది.ఈ కార్యక్రమం లో ఐ ఎఫ్ టి యు జిల్లా నాయకులుబొమ్మగాని వెంకన్న పిన్నోజు చంద్రమౌళి, పాల్గొని మాట్లాడుతూ 8 గంటల పని దినం మేడే వీరుల త్యాగఫలమేనని చెప్పారు.1886లో 8 గంటల పని దినం కోసం, ఇతర కార్మిక హక్కుల కోసం అమెరికాలోని చికాగో కార్మికులు పోరాడారనీ అక్కడి ప్రభుత్వం అక్రమంగా కాల్పులు జరిపి వందలాదిమందిని పోలీసు బలగాలు పొట్టన పెట్టుకున్నాయి. వీరి త్యాగాలను మననం చేసుకొని,వారుఇచ్చినటువంటి పోరాట స్ఫూర్తిని కొనసాగించడానికి కార్మిక వర్గం తమ హక్కుల రక్షణకై బలమైన కార్మికు ఉద్యమాలను నిర్మించాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో హమాలి యూనియన్ నాయకులు లాలు, రమేష్, మంజ, శ్రీను, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు అన్నారపు హనుమంతు తదితరులు పాల్గొన్నారు

# జిజ్ఞాస ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపిక

- ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు గర్వకారణం
- త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటనున్న విద్యార్థులు



**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, ఏప్రిల్. 28, తరంగాలు:**
కేసముద్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రూపొందించిన "జిజ్ఞాస స్టూడెంట్స్ స్టడీ ప్రాజెక్టు" రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం కళాశాలకు గర్వకారణంగా నిలిచింది. కళాశాల తెలుగు విభాగ అధ్యాపకులు సోమ ప్రవీణ్ మార్గదర్శకత్వంలో విద్యార్థులు ఈ ప్రాజెక్టును రూపొందించారు.అంతరిస్తున్న పల్లె గీతాలు – కేసముద్రం ప్రాంత జానపద గేయాలు" అనే అంశంపై ఈ పరిశోధనాత్మక ప్రాజెక్టు చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రమంగా కనుమరుగైపోతున్న జానపద గేయాలను సేకరించి, వాటి సాంస్కృతిక, సామాజిక ప్రాధాన్యతను వెలికితీయడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశ్యంగా ఉంది.ఈ ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంతో పాటు, మేలో హైదరాబాద్ లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులు అర్హత సాధించారు. ఈ పోటీల్లో తమ ప్రతిభను చాటుకుని కళాశాలకు మరింత పేరు తీసుకురావాలని అధ్యాపకులు ఆకాంక్షిస్తున్నారు.రాష్ట్ర స్థాయికి ఈ ప్రాజెక్టు ఎంపిక కావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డా. డి. రాజు,



అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులతో పాటు ప్రాజెక్టు మార్గదర్శకుడు సోమ ప్రవీణ్‌ను ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, విద్యార్థులు ఇలాంటి వినూత్న పరిశోధనాత్మక కార్యక్రమాల్లో పాల్గొని కళాశాల ఖ్యాతిని మరింత పెంచాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులు సృజనాత్మకతతో ముందుకు సాగాలని సూచించారు.కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు ఈ విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ అంకిత్

- రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి


**ఇల్లందు ప్రతినిధి ఏప్రిల్ 28, ( తరంగాలు):**
టేకులపల్లి మండలం బొమ్మనపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ జరుగుతున్న కొనుగోలు ప్రక్రియను సమగ్రంగా పరిశీలించారు. కేంద్రంలో రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా స్వీకరిస్తున్నారా అనే విషయంపై ప్రత్యేకంగా దృష్టి సారించి, సంబంధిత అధికారులను వివిధ అంశాలపై ప్రశ్నించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ధాన్యంలో తేమ శాతాన్ని నిర్ధారించడానికి ఉపయో గిస్తున్న మాయిశ్చరైజింగ్ యంత్రం పనితీరును కలెక్టర్ పరిశీలించారు. తేమ శాతం నిర్ధారణలో ఎలాంటి లోపాలు లేకుండా, ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలను





ఖచ్చితంగా పాటించాలన్నారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా పరీక్షించి వెంటనే కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలని సూచించారు. రైస్ మిల్లులకు ధాన్యం ట్యాగింగ్ విధానం, కొనుగోలు రిజిస్టర్ల నిర్వహణ, టోకెన్ పంపిణీ వ్యవస్థపై సమగ్ర సమాచారం సేకరించారు. టోకెన్లను సమయానికి జారీ చేసి రైతులు అనవసరంగా వేచి ఉండకుండా చూడాలని, ప్రతి రైతుకు పారదర్శకంగా సేవలు అందించాలన్నారు. కొనుగోలు కేంద్రంలో సరైన రికార్డుల నిర్వహణ ఎంతో కీలకమని, ప్రతి నమోదు ఖచ్చితంగా ఉండాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం రైతులకు మద్దతుగా చేపట్టిన ధాన్యం కొనుగోలు కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి, ప్రతి రైతు లాభపడేలా చూడటం అధికారుల బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ వీరభద్రం సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో రైతు కొమురయ్య పంట దగ్ధం



**నల్లబెల్లి ,ఏప్రిల్ 28 తరంగాలు :**
నల్లబెల్లి మండలం లెంకాలపల్లి గ్రామం, కస్తూరిపల్లి పక్కన ఉన్న యడండ్ల కొమురయ్య పొలంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కోత కోసి సిద్ధంగా నిల్వ చేసిన 60 బస్తాల మొక్కజొన్న అగ్నికి ఆహుతైంది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో రైతు కుటుంబం తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ప్రమాదం గమనించిన కస్తూరిపల్లి గ్రామస్థులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని మంటలను నియంత్రించేందుకు ప్రయత్నించారు. వారి వేగవంతమైన చర్యతో మంటలు మరింత విస్తరించకుండా అడ్డుకోగలిగారు. లేకపోతే చుట్టుపక్కల పొలాలకు భారీ నష్టం సంభవించే అవకాశం ఉందని స్థానికులు తెలిపారు. చేతికొచ్చిన పంట క్షణాల్లో కాలిపోవడంతో రైతు కొమురయ్య తీవ్ర మనోవేదన వ్యక్తం చేశారు. సంవత్సరానికి ఒకసారి వచ్చే పంట ఇలా దగ్ధమవడం రైతు కుటుంబాన్ని ఆర్థికంగా కుదేలు చేసింది. ఈ నేపథ్యంలో బాధిత రైతుకు ప్రభుత్వం తక్షణ సహాయం అందించి, సరైన నష్టపరిహారం మంజూరు చేయాలని గ్రామస్థులు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

## రేపు కన్నారావుపేట రైతు వేదికలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు"




**నల్లబెల్లి, ఏప్రిల్ 28 తరంగాలు :**
కన్నారావుపేట రైతు వేదికలో ఈనెల 29న నిర్వహించ తలపెట్టిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి బి. రజిత తెలిపారు మేరకు రేపు బుధవారం నిర్వహిస్తున్న 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం లో వానాకాలం పంటలపై అవగాహన, తాజా సాంకేతికతలు, పురుగు–వ్యాధుల నియంత్రణ చర్యలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రత్యక్షంగా సూచనలు అందించనున్నారు.రైతులు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని వ్యవసాయ అధికారి కోరారు.

జాతీయ దిన పత్రిక
తరంగాలు

## జాబ్ మేళా



**మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, ఏప్రిల్.28, తరంగాలు:** జిల్లా ఉపాధి కార్యాలయం, మహబూబాబాద్ ఆధ్వర్యంలో అపోలో ఫార్మసీ బయ్యారం మరియు హైదరాబాద్ లో ఫార్మసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్, అప్రెంటిస్ షిప్ ఖాళీలను భర్తీ చేయుటకు ఎస్ ఎస్ సి, ఇంటర్, డిగ్రీ, బి. ఫార్మసీ / డి ఫార్మసీ / యం ఫార్మసీ ఉత్తీర్ణతతో 18-35 వయసు గల అభ్యర్థులకు తేది: 30.04.2026 న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి టి.రజిత నేడు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత మరియు ఆసక్తి కలిగిన అభ్యర్థులు తేది: 30.04.2026 న ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, రెజ్యూమ్ తో కలెక్టరేట్ లోని జిల్లా ఉపాధి కార్యాలయం, రూమ్ నెం. 25, రెండవ అంతస్తు, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయము(ఐ డి ఓ సి), కురవి రోడ్, మహబూబాబాద్ నందు హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా ఉపాధి అధికారి కోరారు. మరిన్ని వివరాలకు: 82476 56356 (రఘుపతి, హెచ్ ఆర్, అపోలో ఫార్మసీ) ను సంప్రదించగలరని అన్నారు.

## వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు సమస్యలు తీవ్రం



**జఫర్గడ్ ప్రతినిధి ఏప్రిల్ 28 (తరంగాలు):** మండల కేంద్రంలోని ఐకేపీ , పాక్స్ వద్ద ధాన్యం, మక్కజొన్న, జొన్న కొనుగోలు కేంద్రాన్ని సంఘం ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరి ధాన్యం మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియలో తీవ్ర అవ్యవస్థలు నెలకొన్నాయని, రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.గుర్తించిన ప్రధాన సమస్యలు: రవాణా లారీల కొరతతో వరి, మక్కజొన్న రోజులు తరబడి కేంద్రాల్లోనే నిల్వ ఉండిపోవడం "షార్టేజ్" పేరుతో మిల్లర్లు రైతుల వద్ద అక్రమంగా డబ్బులు వసూలు చేయడంతాలు, తరుగు, మట్టి పేర్లతో అధిక కట్స్ వేయడం వల్ల రైతులకు నష్టంమిల్లర్లకు చెల్లించాల్సిన వర్కింగ్ చార్జీలు విడుదల కాలేదని చెప్పి ధాన్యం దించుకోవడంలో ఆలస్యం పొట్టి గింజలకు "సీ గ్రేడ్" వేయాలని కేంద్ర సిబ్బందిపై ఒత్తిడి వ్యవసాయ శాఖ అధికారులు సరైన తనిఖీలు చేయకుండా టోకెన్లు ఇవ్వకపోవడం ప్రభుత్వం నిర్ణయించిన బరువు ప్రమాణాలను విస్మరించి మిల్లర్లు అధిక బరువు షరతులు విధించడం మొక్కజొన్న, జొన్న కొనుగోలులో సరైన మద్దతు ధరలు అమలు కాకపోవడంగన్ని సంచుల కొరతతో రైతులు ధాన్యం నిల్వ ఉంచుకోవాల్సిన పరిస్థితిఅలాగే కొన్ని డిమాండ్లు చేశారు.వరి ధాన్యం, మొక్కజొన్న, జొన్న కొనుగోళ్లు వెంటనే వేగవంతం చేయాలి.మిల్లర్ల అక్రమ వసూళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలి రవాణా సౌకర్యాలను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలి గన్ని సంచులను తక్షణమే సరఫరా చేయాలి.ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారదర్శకంగా కొనుగోలు జరగాలి రైతులకు తగిన మద్దతు ధరలు, న్యాయం కల్పించాలి ఈ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని రాపర్తి సోమయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సఖి నర్సింగ్, ఎండి ఖాదర్, బంగారు చిరంజీవి, రమ, లక్ష్మి, విమల, సరోజ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల పర్మినెన్సీకి డిమాండ్



**నల్లబెల్లి, ఏప్రిల్ 28 తరంగాలు :** గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ నల్లబెల్లి ఎంపీడీవో కార్యాలయం ద్వారా ముఖ్యమంత్రికి మెమోరాండం సమర్పించారు. 2024 సామాజిక కుటుంబ సర్వే ప్రకారం గ్రామాల జనాభాకు అనుగుణంగా సిబ్బందిని కార్మికులుగా గుర్తించి కార్మిక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పనిలో ప్రమాదాలు జరిగినా వైద్య ఖర్చులు సిబ్బందే భరించాల్సి వస్తోందని, మెడికల్ సెలవులు లేక జీతాలు కోతకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని గ్రామాల్లో నెలల తరబడి జీతాలు అందడం లేదని తెలిపారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా నియామకాలు కొనసాగడంతో పెరిగిన జనాభాకు సరిపడా సిబ్బంది లేరని చెప్పారు. దీంతో తక్కువ వేతనాలతో ఆఫ్లైన్ సిబ్బందిని నియమిస్తున్నారని పేర్కొన్నారు. 2024 కుల జనగణన ఆధారంగా సిబ్బందిని అధికారికంగా గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బట్టు సాంబయ్య, మామిండ్ల పెద్ద అయిలయ్య, జన్ను సుదర్శన్, మామిడి పెల్లి సంపత్, శనిగరం చిరంజీవి, మామిడి పెల్లి రవి, లోనే లింగయ్య, దండెం రాజ్ కుమార్, కలకోటి రాజేష్, అశోధ రాజ్ కుమార్, మాట్ల సాంబయ్య, జాటోతు మోహన్ సింగ్, మాట్ల సునిత, చింత కరుణ, ముత్యాల రమా, బొద్దు సాయికుమార్, అంబిరాజు ముందు కుమార్, బుసారి అప్పయ్య, భూక్యా సాంబయ్య, తియాలపురం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ సమావేశంలో సమస్యలపై కౌన్సిలర్ ఘాటైన ప్రశ్నలు

ఇల్లందు ప్రతినిధి ఏప్రిల్ 28,( తరంగాలు):

ఇల్లందు మంగళవారం జరిగిన మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశంలో, 22వ వార్డు కౌన్సిలర్ కోర్లపాటి శివకిరణ్ పట్టణ ప్రజలను వెంటాడుతున్న ప్రధాన సమస్యలపై ఘాటుగా స్పందించారు. గత ఏడాది కాలంలో మరణించిన ఐదుగురు మున్సిపల్ కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలు ఇప్పటికీ ఎందుకు చెల్లించలేదని అధికారులను ప్రశ్నించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వారి కుటుంబాలు ఆర్థికంగా కుంగిపోతుంటే మున్సిపాలిటీ ఎందుకు స్పందించడంలేదని నిలదీశారు. అలాగే బాధిత కుటుంబాలకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇదే సందర్భంలో పట్టణంలోని 105 మంది కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలు జమ కాకపోవడం ఏమిటని ప్రశ్నిస్తూ ఈ నిర్లక్ష్యం వల్ల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు



పడుతున్నాయని మండిపడ్డారు. ఇక అక్రమంగా కొనసాగుతున్న పంపు కనెక్షన్లపై చర్యలు తీసుకోవడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నిస్తూ వాటిని క్రమబద్ధీకరించి నీటి సదుపాయం కల్పిస్తే మున్సిపల్ ఆదాయం కూడా పెరుగుతుందని సూచించారు. ఇదే సమయంలో గత రెండు సంవత్సరాల్లో నిర్వహించిన ఇంటి పన్నుకు సంబంధించిన సర్వేల్లో 60 శాతం వరకు లోపాలు ఉన్నాయంటే అది అధికారుల వైఫల్యం కాదా అని నిలదీసి వెంటనే సర్వేలను సరిచేసి మున్సిపల్ ఆదాయాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా 19 నుంచి 24 వార్డుల్లో ఎండాకాలంలో తీవ్ర నీటి కొరత నెలకొన్నా పట్టించుకోవడంలేదని విమర్శిస్తూ,ముఖ్యంగా 22వ వార్డులో ట్యాంక్ నిర్మించినప్పటికీ ప్రజలకు నీరు అందక మహిళలు ఇబ్బందులు పడుతున్నారని దానిపై తక్షణ చర్యలు తీసుకోవాలని గట్టిగా డిమాండ్ చేశారు. ఈ సాధారణ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్, మేనేజర్ అంకుష్ షావలి, మున్సిపల్ కౌన్సిలర్ అధికారులు పాల్గొన్నారు.

### కుటుంబ కలహాలతో...

# కొడుకులకు ఉరివేసి తండ్రి ఆత్మహత్య

**తొర్రూర్ ఏప్రిల్ 28 తరంగాలు**

మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణ శివారులో తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబ కలహాలు ఒక నిండు ప్రాణాన్ని, ఇద్దరు పసిమొగ్గలను బలితీసుకున్నాయి. మనస్థాపానికి గురైన ఓ తండ్రి తన ఇద్దరు కుమారులకు ఉరివేసి చంపి, తాను కూడా ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది.

మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణ శివారులో సోమవారం రాత్రి ఈ దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. అమపురం గ్రామానికి చెందిన కిన్నెర గుంశావలి అనే వ్యక్తి, తన ఇద్దరు కొడుకులు విలాష్(5),వికేష్(3)లతో కలిసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంకో కూతురు తల్లి తోఉంది.కొంతకాలంగా కుటుంబంలో జరుగుతున్న గొడవలే ఈ విపరీత నిర్ణయానికి కారణమని తెలుస్తోంది.?ఘటన వివరాలు తొర్రూర్ వ్యవసాయ మార్కెట్ ఎదురుగా ఉన్న కాలీఫ్లవర్ పొలం దగ్గర బాధితులు: కిన్నెర గుంశావలి మరియు అతని ఇద్దరు కుమారులు.వేప చెట్టుకు ఇద్దరు పిల్లలను



ఉరివేసి, అనంతరం గుంశావలి కూడా ఉరివేసుకుని ప్రాణాలు వదిలాడు.?సమాచారం అందుకున్న వెంటనే తొర్రూర్ సీఐ గణేష్, ఎస్సై ఉపేందర్ తమ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. చెట్టుకు వేలాడుతున్న మృతదేహాలను చూసి గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులు మృతదేహాలను కిందికి దించి, పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసుల దర్యాప్తు ప్రాథమిక విచారణ ప్రకారం.. కుటుంబ కలహాల కారణంగానే గుంశావలి తీవ్ర మనస్థాపానికి గురైనట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తును ముమ్మరం చేశారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఇలా విగతజీవులుగా పడి ఉండటంతో అమపురం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సమస్యలు ఏవైనా ఉంటే చర్చించుకోవాలి కానీ, ఇలా పసిపిల్లల ప్రాణాలు తీసి, ఆత్మహత్యలకు పాల్పడటం పరిష్కారం కాదని సామాజిక కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# జూలూరి రమేష్ బాబు ఆధ్వర్యంలో వాసవి మాత జన్మదిన వేడుకలు ఘనంగా

**కల్వకుర్తి ఏప్రిల్ 28 తరంగాలు ప్రతినిధి**

కల్వకుర్తి పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో మాఘ శుద్ధ దశమి సందర్భంగా అమ్మవారి పుట్టినరోజు వేడుకలు ఆలయ ట్రస్ట్ చైర్మన్ జూలూరి రమేష్ బాబు ఆధ్వర్యంలో అంగరంగ వైభవోపేతంగా ఘనంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువ జామున సుప్రభాత సేవతో ఉత్సవాలను ప్రారంభించి అభిషేకాలు నిర్వహించారు. గీతా పారాయణం, హనుమాన్ చాలీసా పటించారు. అనంతరం పల్లకి సేవ నిర్వహించి సామూహిక కుంకుమార్చన చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు దేవాలయానికి విచ్చేసి ఉత్సవాల లో పాల్గొన్నారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్ జూలూరు రమేష్ బాబు ఆధ్వర్యంలో అమ్మవారి డోలహారణం నిర్వహించారు.అమ్మవారిని ఉయ్యాలలో ఉంచి భక్తులు జన్మదినం వేడుకలు నిర్వహించారు. బంగారు కిరీటం అలంకరణ అమ్మవారి జన్మదినం సందర్భంగా ఆదివారం వాసవి కన్యకా పరమేశ్వరి మాత విగ్రహాన్ని బంగారు కిరీటం తో అలంకరించారు. ఆలయ ఆచార ప్రకారం కిరీటాన్ని డప్పు వాయిద్యాలతో ఆలయానికి తీసుకొచ్చి అమ్మవారికి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్ జూలూరు రమేష్ బాబు మాట్లాడుతూ 2022 సంవత్సరంలో అమ్మవారి కి బంగారు కిరీటం చేయించాలని సంకల్పించినట్లు తెలిపారు. దాతల సహకారంతో దాదాపు 50 లక్షల రూపాయల విలువచేసే బంగారంతో అమ్మవారి కిరీటమును చేయించమన్నారు. ప్రతి ఏటా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కిరీటం కోసం సహకరించిన దాతలు అందరికీ ఘనంగా సత్కరించారు. వాసవి మాత జన్మదినం ను రాష్ట్ర పండుగగా ప్రకటించడం పై ధన్యవాదాలు చెబుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కి కృతజ్ఞతలు చెప్పారు. ఆలయంలో మరిన్ని అభివృద్ధి పనులు చేసేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతున్నట్లు ఆలయ ట్రస్ట్ చైర్మన్ జూలూరు రమేష్ బాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ కొండూరు గోవర్ధన్, మండల ఆర్యవైశ్య మహాసభ



అధ్యక్షుడు గంధం ప్రసాద్, పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు వాస శేఖర్, వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ వి 108 ఏ గవర్నర్ కల్మీచర్ల రమేష్, డిస్టిక్ ఆఫీసర్స్ చిగుళ్లపల్లి శ్రీధర్, గుగ్గిళ్ళ శంకర్, మహాసభ నాయకులు సంబు ముత్యాలు, అప్పాయిపల్లి శ్రీనివాస్, గంప వెంకటేష్, గంప శ్రీనివాస్, మండల ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు గోవిందు మౌనిక, వాసవి క్లబ్ అధ్యక్షుడు బాదం హరీష్, వనిత క్లబ్ అధ్యక్షురాలు బాదం సాయి లక్ష్మి తదితరులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు భక్తులు పాల్గొన్నారు.

## బీవోబీ హైదరాబాద్ జోనల్ హెడ్‌గా ఎంవీఎస్ సుధాకర్

**హైదరాబాద్, ఏప్రిల్ 28 తరంగాలు :** ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) హైదరాబాద్ జోనల్ హెడ్‌గా నియమితులైన ఎంవీఎస్ సుధాకర్ మంగళవారం ఉద్యోగ పదవీ



బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ జోన్ పరిధిలో తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్ ఉన్నాయి. 30 ఏండ్లకు పైగా బ్యాంకింగ్ అనుభవం ఉన్న సుధాకర్.. తెలంగాణతోపాటు ఏపీ, తమిళనాడు, ఢిల్లీ, రాజస్థాన్ రాష్ట్రాల్లో విధులు నిర్వహించారు. ఆయన గతంలో న్యూఢిల్లీ జోన్ జోనల్ హెడ్‌గా విధులు నిర్వహించారు.

## అసాధ్యం కానిదాన్ని సుసాధ్యం చేసిన ఘనత బిఆర్ఎస్ పార్టీ దే

• రాంపూర్ సర్పంచ్ వట్టేల నిర్మల శ్రీశైలం యాదవ్



**కల్వకుర్తి ఏప్రిల్ 28 తరంగాలు ప్రతినిధి**

రాంపూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ వట్టేల నిర్మల శ్రీశైలం యాదవ్ ఉప సర్పంచ్ బి.ఆర్.ఎస్. పార్టీ ప్రెసిడెంట్ సంపిడి ఆంజనేయులు ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ ఘనంగా టపాకాయలు పేల్చి నిర్వహించడం జరిగింది. అనంతరం నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ఆత్మగౌరవం కోసం , అసాధ్యమని అనుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును సుసాధ్యం చేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీదే నని 2001 ఏప్రిల్ 27న కేసీఆర్ ఎగురవేసిన గులాబీ జెండా తదనంతరం రాజకీయ పార్టీగా అభివృద్ధి సాధించిన తెలంగాణ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి ఐ..రాష్ట్రాన్ని అనేక రంగాలలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిపి దేశానికే ఆదర్శవంత రాష్ట్రంగా సంక్షేమ పథకాలు తెచ్చి కొన్ని అనివార్య కారణాలవల్ల , కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీల వలన మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో ఓటమికి గురి కావడం జరిగింది. కానీ రానున్న రోజులలో బిఆర్ఎస్ పార్టీని అధికారంలోకి తీసుకు రావడానికి ప్రతి ఒక్కరం కంకణ బద్ధులమై పనిచేస్తామని సోమవారం రాంపూర్ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ 26వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేసిన అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాంపూర్ గ్రామ సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్. ఉప సర్పంచ్ బి ఆర్ ఎస్ పార్టీ ప్రెసిడెంట్ సంపిడి ఆంజనేయులు. సునీత కృష్ణయ్య. లాలమ్మ జంగయ్య. కాకి రాము మీసాల ఆంజనేయులు. మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు మాజీ వార్డ్ నెంబర్లు. బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# రాంపూర్ సంగాయ పల్లి గ్రామంలో చైల్డ్ సేఫ్టీ వీక్ టీనేజ్ గర్భధారణ ఏలోప్ మెంట్‌పై అవగాహన సదస్సు





**కల్వకుర్తి. ఏప్రిల్ 28 తరంగాలు ప్రతినిధి**

తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో ప్రజా పాలనా -ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఈ రోజు చైల్డ్ సేఫ్టీ వీక్ మరియు టీనేజ్ గర్భధారణ మరియు ఏలోప్ మెంట్ అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం ఉద్దేశించి గ్రామ సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ వేసవి కాలంలో పిల్లలు బయటకు రావద్దని సూచించారు. వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి ఆదేశించారు. అలాగే 18 సంవత్సరాల లోపు పెళ్లిళ్లు చేసుకున్నట్లయితే ఫ్యూచర్ లో శరీరక మానసిక సమస్యలు వస్తాయని అలాగే మానసిక ఆందోళన వత్తిడికి గురై ఆర్థికంగా నష్టం జరుగుతుంది అని బాల్య వివాహాలను చేసుకోవద్దని సూచించారు .సరైన సమయంలో పెళ్లిళ్లు చేసుకొని మీ భవిషత్తులో మంచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ప్రకాష్, మల్లయ్య ఉపసర్పంచ్ ఆంజనేయులు, సెక్రటరీ రమేష్, వార్డు మెంబర్స్ మధు ,జంగిలి, నరేష్, రమేష్,రేవతి సిస్టర్, అంఘన్ వాడి టీచర్స్, మాధవి, కృష్ణయ్య, జానయ్య, హరిమోహన్ రెడ్డి, జంగయ్య, ఆంజనేయులు, సుధాకర్, పెంటయ్య సంపత్ యువకులు తదితరులు పాల్గొన్నారు.


# నేటి నిరుద్యోగ అభ్యర్థులను రేపటి అధికారులుగా చూడాలన్నదే నా సంకల్పం



• ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

**కల్వకుర్తి ఏప్రిల్ 28 తరంగాలు ప్రతినిధి**

కల్వకుర్తిపట్టణకేంద్రంలోనిరుద్యోగ యువతలో కొత్త ఆశలు నింపుతూ,ప్రతిభకు దిశా నిర్దేశం చేస్తూసుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి నాల్గవ ఉచిత ఎస్సై ఢ కానిస్టేబుల్ శిక్షణ కేంద్రం ప్రారంభోత్సవం. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి. ఓ. ఓ. సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి చేతుల మీదుగా ఘనంగా జరిగింది. ఈసందర్భంగాసుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డిమాట్లాడుతూనేటినిరుద్యోగ అభ్యర్థులను రేపటి అధికారులుగా చూడాలన్నదే నా సంకల్పం అని గ్రామాల్లో ప్రతిభ ఉందికానీ అవకాశాలు కొరత కూడా ఉంది,ఆ అవకాశాల కొరతను భర్తీ చేయడానికే ఈ ఉచిత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం అని, మీరు నేడు ఆర్థిక పరిస్థితులతో ఇబ్బందులు పడుతున్న అభ్యర్థులు, కానీ రేపు మిమ్మల్ని అధికారులుగా మలోచేందుకే ఈ ప్రయత్నం అని, మన గ్రామీణ ప్రాంత నిరుద్యోగుల పరిస్థితి ఎలా ఉంటుందో స్వయంగా ఎదుర్కొన్న వ్యక్తిగా మీలో ఒకడిగా ఆలోచించి, పట్టుదల ఉన్న యువతకు పరిస్థితులు అడ్డంకి కాకూడదనేప్రతి మండల కేంద్రంలో గ్రామీణ అందుబాటులో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నామని, ప్రభుత్వ ఉద్యోగం ఒక నియామకం మాత్రమే కాదని, అది కుటుంబ గౌరవం, సమాజంలో గుర్తింపు,సేవా బాధ్యత అని పేర్కొన్నారు, ఉచిత శిక్షణ కేంద్రాల ఏర్పాటుతో పాటు అవసరమైన వసతులు అందిస్తూ గ్రామీణ నిరుద్యోగ యువతకు మరింత అండగా నిలుస్తామని తెలిపారు. అనంతరం అతిథులు మాట్లాడుతూ గ్రామీణ యువతకు అందుబాటులో అవకాశాల వేదికలను సృష్టిస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కృషి అభినందనీయం, సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి చేపడుతున్న ఈ కార్యక్రమం కేవలం శిక్షణ కేంద్రం మాత్రమేకాదు, గ్రామీణ యువత జీవితాలను మార్చే గొప్ప కార్యక్రమంగా కొనియాడారు, ఫీజులు కట్టలేక కలలు వదులుకునే పేదింటి విద్యార్థులు ఇలాంటి ఉచిత శిక్షణ కేంద్రాలు భవిష్యత్ ఆశాకిరణలుగా నిలుస్తున్నాయని, చాలా మంది అవకాశాల లేమితో వెనకబడుతున్నారు, ఇలాంటి కార్యక్రమాలు వారిలో ఆత్మవిశ్వాసం నింపుతున్నాయి, సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సేవా దృక్పథం రాజకీయాలకు అతీతమని, యువత భవిష్యత్తుపై బాధ్యతతో చేస్తున్న కృషి నిజంగా అభినందనీయం అని పేర్కొంటూఈ శిక్షణ కేంద్రం నుంచి పెద్ద ఎత్తున భవిష్యత్ పోలీస్ అధికారులు రావాలి అదే ఈకార్యక్రమానికి నిజమైన గౌరవం ఈసందర్భంగా విద్యార్థులకు సూచించారు. శిక్షణ కేంద్రంలో చేరిన విద్యార్థులు మాట్లాడుతూ తమలాంటి గ్రామీణ నిరుద్యోగ యువతకు ఇది గొప్ప అవకాశం అని, మా పరిస్థితుల్లో కోచింగ్ అనేది మాకు చాలా ఖర్చుతో కూడుకున్న పరిస్థితి అని,ఇలాంటి పరిస్థితుల్లో మాకు సుంకిరెడ్డి సహకారంతో గొప్ప అవకాశం లభించింది అని, ఉద్యోగం సాధించి ఈ నమ్మకాన్ని నిలబెడతాం అంటూ, సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రసున్న, జేఏసీ చైర్మన్ సదానందం గౌడ్ సీనియర్ పాత్రికేయులు ప్రహ్లాద్, పరిపూర్ణం, శ్రుతిలయ అకాడమీ చైర్మన్ చిత్తరంజన్ దాస్ తో పాటుఐక్యత ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## అనిల్ అంబానీ మరో 3 వేల కోట్ల ఆస్తుల జప్తు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28 తరంగాలు :**



అనిల్ అంబానీకి చెందిన మరో రూ.3 వేల కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసింది ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ). బ్యాంకులను మోసం చేసిన కేసులో మనీలాండరింగ్ జరిగిందంటూ ఆరోపిస్తున్న ఈడీ.. తాజాగా అనిల్ అంబానీ, ఆయన కుమారుడు అన్మల్ అంబానీలకు చెందిన రూ.3,034 కోట్ల విలువైన ఖాందాల ఫామ్‌హౌస్‌ను జప్తు చేసినట్టు ఈడీ వర్గాలు వెల్లడించాయి. మనీలాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్ఏ) కింద ఆస్తులను దుర్వినియోగం చేయడంతోపాటు బ్యాంకులను మోసం చేసిన కేసులో రిలయన్స్ కమ్యూనికేషన్స్‌కు చెందిన ఆస్తులను ఈడీ జప్తు చేస్తున్నది. దీనిపై అడాగ్ ప్రతినిధి మాట్లాడుతూ..అనిల్ అంబానీ తల్లి కోకిలాబెన్ డీ అంబానీ ఆస్తులను కూడా జప్తు చేశారని పేర్కొన్నారు.ఆర్‌కామ్‌కు వ్యతిరేకంగా ఎస్బీఐ, పీఎన్‌బీ, బీవోబీ, ఎల్ఐసీలు నమోదు చేసిన కేసులపై ఇప్పటికే సీబీఐ ఎఫ్ఐఆర్‌ను దాఖలు చేసింది.

## తగ్గిన పసిడి ధరలు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28 తరంగాలు :**

పసిడి ధరలు తగ్గుముఖం పట్టాయి. గత కొన్ని రోజులుగా పెరుగుతూ వచ్చిన పుత్తడి, వెండి ధరలు భారీగా పడిపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ పడిపోవడంతోపాటు క్రూడాయిల్, డాలర్ మరింత బలోపేతం కావడం ధరలు దిగువముఖం పట్టాయి. దేశ రాజధాని న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల గోల్డ్ ధర రూ.1,800 తగ్గి రూ.1.54 లక్షలకు దిగొచ్చింది. అంతకుముందు ఇది రూ.1.56 లక్షలుగా ఉన్నది. పసిడితోపాటు వెండి ధర రూ.6,500 లేదా 3 శాతం తగ్గి రూ.2.44 లక్షల దిగువకు పడిపోయింది. బంగారం ధరలు మూడు వారాల కనిష్ఠ స్థాయికి పడిపోయినట్లు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 95.37 డాలర్లు లేదా 2 శాతం తగ్గి 4,586.50 డాలర్లకు పడిపోగా, వెండి 73 డాలర్లకు దిగొచ్చింది.

## మార్కెట్లకు చమురు దెబ్బ..

# సెన్సెక్స్ 417, నిఫ్టీ 97 పాయింట్లు డౌన్

**ముంబై, ఏప్రిల్ 28 తరంగాలు :**

దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయి. వరుసగా 3 రోజులపాటు క్షీణించిన సూచీలు.. సోమవారం కోలుకున్న విషయం తెలిసిందే. అయితే మంగళవారం తిరిగి పతనమయ్యాయి. భౌగోళిక-రాజకీయ అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పెరుగడం, భారతీయ మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడులు తరలిపోవడం.. కొనుగోలు సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఉదయం ట్రేడింగ్ మొదలైన దగ్గర్నుంచి మదుపర్లు అమ్మకాల ఒత్తిడినే ఎదుర్కొన్నారు. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 416.72 పాయింట్లు లేదా 0.54 శాతం దిగజారి 76,886.91 వద్ద ముగిసింది. ఒకానొక దశలో 562.57 పాయింట్లు కోల్పోయింది. ఇక నిఫ్టీ 97 పాయింట్లు లేదా 0.40 శాతం నష్టపోయి 23,995.70 దగ్గర నిలిచింది. హెవీ వెయిట్ షేర్ మారుతీ సుజుకీ బీఎస్ఈలో 2.53 శాతం క్షీణతతో రూ.12,891. 70 వద్ద స్థిరపడింది. జనవరి-మార్చి త్రైమాసికంలో సంస్థ ఏకీకృత నికర లాభం 6.45 శాతం పడిపోవడమే కారణం.



### నష్టాల్లో బ్యాంకింగ్, ఏవియేషన్ షేర్లు

విమానయాన, బ్యాంకింగ్ రంగాల షేర్లకు మదుపర్లు దూరం జరిగారు. పెరుగుతున్న ఇంధన ధరల మధ్య కార్యకలాపాలు నడుపలేని దుస్థితిలో ఉన్నామని దేశీయ ప్రధాన ఎయిర్‌లైన్స్ కేంద్ర ప్రభుత్వానికి చెప్పడం.. షేర్ల కొనుగోలు అవకాశాలను దెబ్బతీశాయి. ఈ క్రమంలోనే స్పైస్‌జెట్ షేర్ విలువ బీఎస్ఈలో 4.96 శాతం దిగజారి రూ.14 వద్ద ముగిసింది. ఇండిగో షేర్ విలువ కూడా 2.59 శాతం పడిపోయి రూ.4,445.10 వద్ద ఆగింది. మరోవైపు నిబంధనల కఠినతరం అంచనాల నడుమ బ్యాంకింగ్ షేర్లూ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి.

### 53 పైసలు క్షీణించిన రూపీ విలువ

డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ మంగళవారం భారీగా క్షీణించింది. ఈ ఒక్కరోజే 53 పైసలు దిగజారింది. ఫలితంగా 94.68 వద్ద స్థిరపడింది. కాగా, పెరుగుతున్న ముడి చమురు ధరలు, వెనుకకుపోతున్న విదేశీ పెట్టుబడులు.. దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్‌ను పెంచాయని తాజా ట్రెండ్‌ను విశ్లేషిస్తున్నారు.

THARANGALU DAILY NEWS
బుధవారం, 29 ఏప్రిల్, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# డిజిటల్ అరెస్ట్ మోసాలపై కట్టడి చర్యలు వేగం

- పెరుగుతున్న సైబర్ మోసాలపై ఆందోళన
- కేంద్రం సమగ్ర నివేదిక సమర్పణ
- కొత్త నిబంధనలతో కట్టడి దిశగా అడుగులు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 28 దేశవ్యాప్తంగా గత కొన్ని నెలలుగా "డిజిటల్ అరెస్ట్" పేరుతో జరుగుతున్న సైబర్ మోసాలు తీవ్రంగా పెరుగుతున్నాయి. సామాన్య ప్రజల నుంచి ప్రముఖుల వరకు అనేకమంది ఈ మోసాలకు బలవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిణామాలపై సుప్రీంకోర్టు కూడా గంభీరంగా స్పందించింది. బాధితులు మోసపోయే విధానం కొత్త తరహాలో ఉండటం వల్ల ప్రజలు సులభంగా ఉచ్చులో పడుతున్నారని న్యాయస్థానం అభిప్రాయపడింది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం పలు కఠిన నిబంధనలను రూపొందించింది. ఈ నిబంధనలపై సమగ్ర నివేదికను తాజాగా సుప్రీంకోర్టుకు సమర్పించింది. సైబర్ నేరాలను అరికట్టేందుకు సాంకేతిక చర్యలు, బ్యాంకింగ్ నియంత్రణలు, టెలికాం మార్పులు వంటి అంశాలను ఈ నివేదికలో చేర్చినట్లు తెలుస్తోంది.కేంద్రం సమర్పించిన నివేదికలో ప్రధానంగా బయోమెట్రిక్ సిమ్ ధృవీకరణ, అనుమానాస్పద బ్యాంకు ఖాతాల తాత్కాలిక నిలిపివేత వంటి చర్యలు కీలకంగా ఉన్నాయి. నిపుణులు, సంబంధిత విభాగాల అధికారులతో చర్చలు జరిపిన అనంతరం ఈ ప్రతిపాదనలు రూపొందించినట్లు కేంద్రం వెల్లడించింది. ఈ నివేదికను సుప్రీంకోర్టు పరిశీలించి సంబంధిత శాఖలకు మార్గదర్శకాలు జారీ చేసే అవకాశం ఉంది. సిమ్ కార్డుల జారీ ప్రక్రియలో కఠిన నిబంధనలు అమలు చేయాలని కేంద్రం సూచించింది. టెలికాం సేవలందించే సంస్థలు వినియోగదారుల గుర్తింపును ఖచ్చితంగా ధృవీకరించాల్సి ఉంటుంది. సిమ్ యాక్టివేషన్ సమయంలో పాయింట్ ఆఫ్ సేల్స్ విక్రేతలను తరచుగా పరిశీలించాల్సి ఉంటుందని నివేదికలో పేర్కొన్నారు. దర్యాప్తు సమయంలో వినియోగదారుల వివరాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అదేవిధంగా మోసాలకు ఉపయోగించే సిమ్ కార్డులను వెంటనే బ్లాక్ చేయాలని కేంద్రం సూచించింది. వాట్సాప్ వంటి యాప్‌లు సిమ్ ఆధారిత భద్రతా విధానాలను మరింత కఠినంగా అమలు చేయాలని పేర్కొంది. దీర్ఘకాలం కొనసాగుతున్న అనుమానాస్పద కాల్స్‌ను గుర్తించే సాంకేతిక ఫీచర్లు తీసుకురావాలని సూచించింది. మోసాలకు ఉపయోగించే డివైజ్‌లను గుర్తించి వాటి వినియోగాన్ని నిలిపివేయాలని నివేదికలో పేర్కొన్నారు. సైబర్ నేరాలకు ఉపయోగించే బ్యాంకు ఖాతాలపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్రం సూచించింది. అనుమానాస్పద లావాదేవీలు గుర్తించిన వెంటనే ఆ ఖాతాలను తాత్కాలికంగా నిలిపివేయాలని పేర్కొంది. ఇందుకోసం రిజర్వ్ బ్యాంక్ మార్గదర్శకాల ప్రకారం ప్రత్యేక విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని నివేదికలో స్పష్టం చేసింది. ఈ చర్యలతో డిజిటల్ అరెస్ట్ మోసాలను గణనీయంగా తగ్గించవచ్చని కేంద్రం భావిస్తోంది.

# మార్తినేని ధర్మ రావును పరామర్శించిన వన్నాల వెంకట రమణ



హైదరాబాద్, ఏప్రిల్ 28,తరంగాలు :మాజీ శాసనసభ్యులు, బిజెపి జాతీయ కౌన్సిలర్ సభ్యులు మార్తినేని ధర్మ రావు ను బిజెపి అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకట రమణ పరామర్శించారు. నర్సంపేట కు చెందిన ఆర్టీసీ కార్మికుడు, బస్ డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్య అనంతరం నర్సంపేట లో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తో ఈనెల 24వ తేదీ రోజున (శుక్రవారం) ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఎం. ధర్మారావుకు అకస్మాత్తుగా ఛాతీ నొప్పితో తీవ్ర అస్వస్థతకు గురాయ్యారు.మొదటగా హన్మకొండ లోని రోహిణి హాస్పిటల్ లో చికిత్స అందించి, తరవాత హైదరాబాద్ గచ్చిబౌలిలో ఉన్న ఏఐజి ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటుండగా బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ వారి సతీమణి పావన ఆసుపత్రి కి వెళ్ళి ధర్మారావు ను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు తెలుసుకున్నారు. ధర్మ రావు వీలైనంత త్వరగా, సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.


# సమయపాలన పాటించని పల్లె దవాఖాన డాక్టర్

- గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు అందని వైద్యం
- డాక్టర్ అందుబాటులో లేక ప్రవేట్ హాస్పటల్ ను ఆశ్రయిస్తున్న గ్రామీణ ప్రాంత ప్రజలు
- వార్త ప్రచురించొద్దంటూ పలువురు ఫోన్లు




ఇల్లందు ప్రతినిధి ఏప్రిల్ 28, ( తరంగాలు): ఇల్లందు మండలం సుదిమళ్ళ గ్రామపంచాయతీ పరిధిలో గల హనుమంతులపాడు పల్లె దవాఖాన లో వైద్య సేవలు అందించాల్సిన డాక్టర్ మంగళవారం ఉదయం 11:05 అయినా రాకపోవడం తో పల్లె దవాఖానలో ఖాళీ కురిచేరి దర్శనమిస్తున్నాయి.

సమయ పాలన పాటించకుండా గతంలో కూడా ఇలాంటి సంఘటనలు జరిగాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో రోగులకు వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో పల్లె దవాఖానలను ఏర్పాటు చేయగా, ఇదే గ్రామంలో ఉండి వైద్య సేవలు అందించాల్సిన డాక్టర్ వేరే ప్రాంతంలో ఉంటారని, నెలలో అడప దడప వస్తు మిగతా రోజులలో ఆశ వర్కర్లతో పల్లె దావఖానను నడిపిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.డాక్టరు అందుబాటులో లేక గ్రామీణ ప్రాంతాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రైవేట్ హాస్పటల్ ను ఆశ్రయించాల్సి వస్తుందని తెలిపారు. ప్రజలు చెప్పిన సమాచారం మేరకు వాస్తవాన్ని తెలుసుకునేందుకు వెళ్లిన రిపోర్టర్ కు నీను జిల్లా ఆఫీసర్ ని అని ఒకరు, మరొకరు ఎడిటర్ అని, నేనొక ఛానల్ కు సంబంధించిన రిపోర్టర్ నని పలువురు ఫోన్లు చేస్తూ వార్త రాయకూడదంటూ వాస్తవాన్ని ఉన్నత అధికారులకు తెలియకుండా విధులకు ఆటంకం కలిగిస్తు పత్రిక స్వేచ్ఛను కాల రాయడం సిగ్గుగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన--- ప్రణాళిక పూర్తికాకముందే ప్రభుత్వ నియమాలు పాటించని డాక్టర్ కి వతస్తు పలకడం వెనుక అంతర్యం ఏమిటి , ప్రజలు కట్టే పన్నులతో జీతాలు తీసుకుంటూ తీసుకున్న జీతానికి న్యాయం చేసేలా ఉండాలని ప్రశ్నించారు. పల్లె దవాఖాన డాక్టర్ ఇదే గ్రామంలో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలని కోరారు.



# రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం

- కాంగ్రెస్ నేతల పిలుపు
- కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు మిద్దెల జితేందర్ అధ్యక్షతన జరిగిన సమగ్ర శిక్షణ శిబిరంలో పలు కీలక నిర్ణయాలు
- గెలుపే లక్ష్యం.. కాంగ్రెస్ శిక్షణ శిబిరంలో వ్యూహాత్మక నిర్ణయాలు



హైదరాబాద్, ఏప్రిల్ 28,తరంగాలు :హైదరాబాద్ లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో మంగళవారం కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు మిద్దెల జితేందర్ అధ్యక్షతన నిర్వహించిన 'సమగ్ర శిక్షణ శిబిరం" కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ కార్యాచరణపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మరోసారి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంతో పాటు, రాహుల్ గాంధీని దేశ ప్రధాని చేయడమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టిగా పనిచేయాలని టీ-పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ గౌడ్, సెక్రటరీ సచిన్ సావంత్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బీఎల్‌ఏ నియామకాలు, మండల కమిటీలు, గ్రామ కమిటీలు, జిల్లా కమిటీల ఏర్పాటు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో భారీ స్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని నాయకత్వం సూచించింది.

అదేవిధంగా పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడం, క్షేత్రస్థాయిలో కేడర్‌ను చైతన్యవంతం చేయడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేసే విధంగా భవిష్యత్తు కార్యాచరణ రూపొందించాలని నాయకత్వం దిశానిర్దేశం చేసింది.

కాంగ్రెస్ సేవాదళ్ కు తగిన గుర్తింపు

పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న కాంగ్రెస్ సేవాదళ్ కార్యకర్తలకు తగిన గుర్తింపు కల్పిస్తామని రాష్ట్ర నాయకత్వం హామీ ఇచ్చింది. రానున్న నామినేటెడ్ పోస్టులతో పాటు స్థానిక సంస్థలు, వివిధ ఎన్నికల్లో సేవాదళ్ నేతలకు ప్రాధాన్యతనిస్తూ అవకాశాలు కల్పిస్తామని స్పష్టం చేసింది. పార్టీ బలోపేతంలో సేవాదళ్ పాత్ర కీలకమని పేర్కొంటూ నాయకులకు, కార్యకర్తలకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ డిసిసి అధ్యక్షులు



మహమ్మద్ హయుబ్, రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి సుంకరి శ్రీనివాస్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్, వర్ధన్నపేట నియోజకవర్గ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్ రావు, వరంగల్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్, రాష్ట్ర, జిల్లా నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, నలుమూలల నుండి వచ్చిన వివిధ జిల్లాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యువత దేశ భవిష్యత్తు

**డ్రగ్స్‌కు నో -- పిల్లల భద్రతపై కలెక్టర్ సత్య శారద పిలుపు**





వరంగల్ ప్రతినిధి,ఏప్రిల్ 28,తరంగాలు : ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా "పిల్లల భద్రత మరియు రక్షణ -- డ్రగ్స్‌కు నో చెప్పండి" అవగాహన కార్యక్రమం వర్ధన్నపేటలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, మున్సిపల్ చైర్ పర్సన్ పాలకుర్తి సారంగపాణి పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సభలో కలెక్టర్ మాట్లాడుతూ, యువత దేశ భవిష్యత్తు అని, వారిని మత్తు పదార్థాల నుండి దూరంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. డ్రగ్స్ వినియోగం వల్ల వ్యక్తిగత ఆరోగ్యం మాత్రమే కాకుండా కుటుంబాలు, సమాజం కూడా తీవ్రంగా ప్రభావితమవుతాయని హెచ్చరించారు.తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై నిరంతరం పర్యవేక్షణ కలిగి ఉండాలని, వారి ప్రవర్తనలో మార్పులను గమనించి సమయానికి సరైన మార్గదర్శనం చేయాలని సూచించారు.ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ బాలల రక్షణకు కట్టుబడి ఉండాలని ఆదేశించారు.కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ప్రమాణం చేయించడంతో పాటు "డ్రగ్స్‌కు నో" సందేశంతో ర్యాలీ నిర్వహించారు.యువతకు మత్తు పదార్థాల ప్రమాదాలపై విపులంగా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్ఓ విజయలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, డీఎంహెచ్ఓ సాంబశివరావు, తహసీల్దార్ విజయ్ సాగర్, మున్సిపల్ కమిషనర్ జోనా, ఎంపీడీఓ వెంకటరామణ, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఉమా, పోలీస్, విద్యాశాఖ అధికారులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులోకి మిచెల్ స్టార్క్

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభమై సగం మ్యాచ్‌లు ముగిసిన తర్వాత ఢిల్లీ క్యాపిటల్స్ అభిమానులకు ఊరటనిచ్చే వార్త అందింది. ఆస్ట్రేలియా స్టార్ ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ ఎట్టకేలకు తన ఫ్రాంచైజీతో చేరాడు. క్రికెట్ ఆస్ట్రేలియా నుంచి నిరభ్యంతర పత్రం లభించడంతో స్టార్క్ ఢిల్లీ జట్టులో చేరినట్లు యాజమాన్యం ధృవీకరించింది. మెగా వేలంలో రూ. 11.75 కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన ఈ స్టార్ బౌలర్ అందుబాటులోకి రావడం ఢిల్లీ బౌలింగ్ విభాగానికి కొండంత అండగా మారనుంది. మిచెల్ స్టార్క్ ఈ ఏడాది జనవరి చివరి వారం నుండి ఎటువంటి పోటీ క్రికెట్ ఆడలేదు. ఆస్ట్రేలియాలో జరిగిన బిగ్ బాష్ లీగ్ లో సిడ్నీ సిక్సర్స్ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న సమయంలో ఆయన గాయపడ్డారు. బౌండరీ వద్ద క్యాచ్ పట్టే ప్రయత్నంలో స్టార్క్ ఎడమ భుజం మరియు మోచేతికి తీవ్రమైన గాయమైంది. ఈ గాయం కారణంగా ఫిట్‌నెస్ సాధించడం ఆలస్యం కావడంతో, ఐపీఎల్ ప్రారంభ మ్యాచ్‌లకు ఆయన దూరం కావాల్సి వచ్చింది. ఇప్పటివరకు ఢిల్లీ ఆడిన ఎనిమిది మ్యాచ్‌ల్లో స్టార్క్ లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది. సోమవారం రాత్రి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్ అనంతరం ఢిల్లీ కెప్టెన్ అక్షర్ పటేల్ స్టార్క్ రాకపై స్పందించారు. "అవును, మిచెల్ స్టార్క్ జట్టుతో చేరారు. ఆయనకు మే 1వ తేదీ నుండి ఆడేందుకు ఎన్ఓసీ లభించింది. ప్రస్తుతానికి ఆయన వర్క్‌లోడ్‌ను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ఆయన పూర్తిగా అందుబాటులోకి వచ్చిన వెంటనే తుది జట్టులోకి తీసుకుంటాం" అని అక్షర్ పేర్కొన్నారు. గత సీజన్‌లో 11 మ్యాచ్‌ల్లో 14 వికెట్లు తీసి స్టార్క్ అద్భుతంగా రాణించారు. స్టార్క్ రాక వార్త ఒకవైపు సంతోషాన్ని కలిగిస్తున్నా, సోమవారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ ప్రదర్శన మాత్రం పీడకలలా మిగిలిపోయింది. ఆర్సీబీ బౌలర్ల ధాటికి ఢిల్లీ బ్యాటింగ్ ఆర్డర్ కుప్పకూలింది. పవర్‌ప్లేలోనే ఏకంగా ఆరు వికెట్లు కోల్పోయి 75 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ స్వల్ప లక్ష్యాన్ని ఆర్సీబీ వికెట్ కోల్పోకుండా సునాయాసంగా ఛేదించింది. ఈ ఘోర ఓటమిపై అక్షర్ పటేల్ అసహనం వ్యక్తం చేశారు. "అసలేం జరిగిందో నాకిప్పటికీ అర్థం కావడం లేదు. క్రికెట్‌లో ప్రతిరోజూ కొత్త సవాళ్లు ఎదురవుతాయి. ఈ ఓటమిని మర్చిపోయి వచ్చే మ్యాచ్‌పై దృష్టి సారించాల్సి ఉంది" అని ఆయన అన్నారు ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఏడో స్థానానికి పడిపోయిన ఢిల్లీ క్యాపిటల్స్, తన తదుపరి పోరులో మే 1వ తేదీన జైపూర్‌లోని సవాయ్ మాన్ సింగ్ స్టేడియంలో రాజస్థాన్ రాయల్స్‌తో తలపడనుంది. అదే రోజున స్టార్క్ అందుబాటులోకి వస్తుండటంతో, రాజస్థాన్ పటిష్టమైన బ్యాటింగ్ ఆర్డర్‌ను స్టార్క్ ఏ మేరకు అడ్డుకుంటాడో చూడాలి

## శాంట్నర్ స్థానంలో కేశవ్ మహరాజ్

**ముంబయి జట్టులోకి రానున్న స్పిన్నర్**

ఐపీఎల్ 2026లో ఆశించిన స్థాయిలో రాణించలేక పోతున్న ముంబయి ఇండియన్స్ కష్టాలు రెట్టింపయ్యాయి. ఆ జట్టు ప్రధాన స్పిన్ ఆల్‌రౌండర్ మిచెల్ శాంట్నర్ భుజం గాయం కారణంగా ఈ సీజన్ నుండి వైదొలిగారు. బౌండరీ లైన్ వద్ద క్యాచ్ పట్టే ప్రయత్నంలో ఆయనకు ఈ గాయమైంది. శాంట్నర్ స్థానంలో దక్షిణాఫ్రికా వెటరన్ స్పిన్నర్ కేశవ్ మహరాజ్‌ను ముంబయి జట్టులోకి తీసుకుంది. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన హోమ్ మ్యాచ్‌లో శాంట్నర్ ఫీల్డింగ్ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బౌండరీ వద్ద ఒక కఠినమైన క్యాచ్‌ను అందుకునే క్రమంలో ఆయన భుజానికి తీవ్రమైన గాయమైంది. అదే సమయంలో ఆయన తల కూడా బలంగా నేలకు తగిలింది. దీంతో ఆయనను మైదానం నుంచి వెలుపలికి తీసుకెళ్లాల్సి వచ్చింది. వాస్తవానికి అప్పటికే శాంట్నర్ తన 4 ఓవర్ల కోటాను పూర్తి చేసి, ఒక వికెట్ తీసి 44 పరుగులు సమర్పించుకున్నారు. శాంట్నర్ తలకు దెబ్బ తగలడంతో, నిబంధనల ప్రకారం శార్దూల్ ఠాకూర్‌ను కన్కషన్ సబ్‌స్టిట్యూట్‌గా జట్టులోకి తీసుకున్నారు. అయితే, ముంబయి అప్పటికే అల్లా గజన్ఫర్ స్థానంలో డానిష్ మలేవర్‌ను 'ఇంపాక్ట్ ప్లేయర్'గా ఉపయోగించుకుంది. 208 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో శార్దూల్ ఠాకూర్ 12 బంతుల్లో కేవలం 6 పరుగులు మాత్రమే చేయగలిగారు. ఈ మ్యాచ్‌లో ముంబయి 103 పరుగుల భారీ తేడాతో ఓటమిని చవిచూసింది. శాంట్నర్‌ను గత కొంతకాలంగా భుజం గాయం వేధిస్తోంది. ఏప్రిల్ 4న ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆయన బౌలింగ్ చేయని భుజానికి చిన్న గాయమైంది. దీనివల్ల ఏప్రిల్ 7న రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌కు ఆయన దూరమయ్యారు.

# డ్రగ్స్‌కు బానిసలు కాకుండా యువతను కాపాడుకుందాం

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్**




వరంగల్ ప్రతినిధి, ఏప్రిల్ 28,తరంగాలు : డ్రగ్స్‌కు బానిసలుగా మారకుండా యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై వుందని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులకు తెలియజేసారు. నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయములోని సమావేశ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ముందుగా పోలీస్ కమిషనర్ పరిధిలోని పెండింగ్ కేసులు, నిందితుల అరెస్తు, కేసుల దర్యాప్తు, నేర నియంత్రణ కోసం సంబంధిత పోలీస్ అధికారులు తీసుకుంటున్న చర్యలపై పోలీస్ కమీషనర్ సంబంధిత స్టేషన్ అధికారులను అడిగి తెలుకోవడంతో పాటు, పెండింగ్ కేసుల, కేసుల పురోగతికై తీసుకోవాల్సిన చర్యలపై పోలీస్ కమిషనర్ అధికారులు సూచనలు, సలహాలను అందజేసారు. అనంతరం అధికారులను ఉద్యేశిస్తూ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మూగ జీవాల అక్రమ రవాణాపై అధికారులు అప్రమత్తంగా వుండాలని, ముఖ్యంగా ఇతర ప్రాంతాలను వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రాకుండా అలాగే ఇక్కడి ఇతర ప్రతి ప్రాంతాలకు మూగ జీవాలను తరలించకుండా జాగ్రత్త పడాలని, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్ణీత సమయాల్లో షాపులు మూసి వేసే విధంగా స్టేషన్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని, సమయ పాలన పాటించని షాపుల యజమానులను కేసులను నమోదు చేయడంతో పాటు వారి డిసిపి స్థాయి పోలీస్ అధికారుల ఏదుట బైండోవర్ చేయాల్సి వుంటుందని, అలాగే పెట్రోల్, డిజిల్ కోరతపై తప్పుడు ప్రచారం కారణంగా పెట్రోల్ బంకులకు తరలివస్తున్న రద్దీని దృష్టిలో వుంచుకోని ఎలాంటి శాంతి భద్రత సమస్యలు రాకుండా స్థానిక పోలీసులు ముందస్తూ చర్యలు చేపట్టాలని. మత్తు పదార్థాల నియంత్రణలో భాగంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ముమ్మరంగా విద్యా సంస్థలతో పాటు, గ్రామాల్లో, ప్రధాన కూడళ్లల్లో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలని, ముఖ్యంగా విద్యాసంస్థలకు వంద మీటర్ల పరిధిలోని ఎలాంటి పోగాకు ఉత్పత్తులకు సంబంధించి విక్రయాలు జరగకుండా తగు చర్యలు చర్యలు తీసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులను అదేశించారు.

అనంతరం పోలీస్ మత్తు పదార్థాల నియంత్రణతో పాటు, పోక్సో కేసుల్లో నిందితులకు శిక్షలు ఖరారు కావడంలో ను ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు, సిబ్బందికి వరంగల్ పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా నగదు రివార్డులతో ప్రశంస పత్రాలను అందుకున్నారు.ఈ సమావేశంలో డిసిపిలు అంకిత్ కుమార్, రాజమహేంద్ర నాయక్, దార కవిత, ట్రైనీ ఐపిఎస్ మనిషా నేహ్రా, అదనపు డిసిపిలు రవి,బాలస్వామి,సురేష్‌కుమార్‌తో పాటు ఏసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు, సబ్-ఇన్స్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.





## దూబే, ఫెరీరా విధ్వంసం..పంజాబ్ జైత్రయాత్రకు బ్రేక్..!



పంతొమ్మిదో సీజన్‌లో భారీ లక్ష్యాలను అలవోకగా ఛేదిస్తూ అజేయంగా దూసుకెళ్తున్న పంజాబ్ కింగ్స్‌కు షాకిచ్చింది రాజస్థాన్ రాయల్స్. ఆరు విజయాలతో టేబుల్ టాపర్‌గా కొనసాగుతున్న పంజాబ్‌కు తొలి ఓటమి రుచి చూపించింది. 223 లక్ష్య ఛేదనలో యశస్వీ జైస్వాల్(51), వైభవ్ సూర్యవంశీ(43)లు మెరుపు ఆరంభమివ్వగా.. డొనొవాన్ ఫెరీరా(52 నాటౌట్), ఇంప్యాక్ట్ సబ్ శుభం దూబే(31 నాటౌట్)లు డెత్ ఓవర్లలో పంజాబ్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఆరో విజయంతో మూడో స్థానానికి దూసుకెళ్లింది రాజస్థాన్.

ఐపీఎల్-19లో పంజాబ్ కింగ్స్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఎదురైన ప్రత్యర్థినల్లా ఓడిస్తున్న పంజాబ్‌కు సొంత మైదానంలో రాజస్థాన్ రాయల్స్ ఊహించని పంచ్ ఇచ్చింది. ముల్లన్‌పూర్‌లో నిర్దేశించిన 223 పరుగుల ఛేదనను రాజస్థాన్ రాయల్స్ ధాటిగా మొదలెట్టింది. తొలి ఓవర్లోనే అర్ష్‌దీప్ సింగ్‌కు చుక్కలు చూపిస్తూ వైభవ్ సూర్యవంశీ(43) 6, 4, 4 బాదాడు. అనంతరం యాన్సెన్, ఫెర్గూసన్ ఓవర్లోనూ వైభవ్ విధ్వంసంతో 20 బంతుల్లోనే 51 పరుగులు చేసింది రాజస్థాన్. అర్ధ శతకానికి చేరువైన వైభవ్ ఆ తర్వాతి బంతికే అయ్యర్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ధ్రువ్ జురెల్()ను చాహల్ ఔట్ చేసి రెండో వికెట్ అందించాడు. కాసేపు షాట్లతో అలరించిన యశస్వీ జైస్వాల్()ను సైతం వెనక్కి పంపిన చాహల్.. కెప్టెన్ రియాన్ పరాగ్()ను పెవిలియన్ చేర్చాడు. చాహల్ వేసిన 14వ ఓవర్లో తొలి రెండు బంతుల్ని 6, 4 గా మలిచిన పరాగ్ చివరి బంతికి ఔటయ్యాడు.

### దూబే, ఫెరీరా ధనాధన్

వెంట వెంటనే వికెట్లు పడినా ఇంప్యాక్ట్ సబ్‌గా వచ్చిన శుభమ్ దూబే(31 నాటౌట్) డొనొవాన్ ఫెరారా(52 నాటౌట్)లు అదరలేదు. గెలుపు బాధ్యత తీసుకున్న ఈ జోడీ పంజాబ్ నుంచి మ్యాచ్‌ను లాగేసుకుంది. అర్ష్‌దీప్ వేసిన 18వ ఓవర్లో ఫెరీరా 6, 4.. చివరి బంతిని దూబే స్టాండ్స్‌లోకి పంపగా మ్యాచ్ రాజస్థాన్ వైపు మళ్లింది. 12 బంతుల్లో 18 రన్స్ అవసరమైన వేళ.. ఫెర్గూసన్ బౌలింగ్‌లో 4, 6 బాదిన ఫెరీరా పంజాబ్ ఓటమిని ఖాయం చేశాడు. యాన్సెన్ వేసిన ఇన్నింగ్స్ చివరి ఓవర్లో స్ట్రెయిట్ సిక్సర్‌తో అర్ధ శతకం సాధించిన ఫెరీరా.. రాజస్థాన్‌కు 6 వికెట్ల విజయాన్ని కట్టబెట్టాడు.

### ప్రభ్‌సిమ్రన్, స్టోయినిస్ మెరుపులు

పంజాబ్ కింగ్స్ ముల్లన్‌పూర్ భారీ స్కోర్ కొట్టింది. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్(59) ఎప్పటిలానే శుభారంభమివ్వగా.. కూపర్ కొన్నొల్లీ(30), కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(30)లు దంచేశారు. డెత్ ఓవర్లలో మార్కస్ స్టోయినిస్(62 నాటౌట్) సిక్సర్ల మోతతో పంజాబ్ స్కోర్ 200 దాటింది. బ్రిజేశ్ శర్మ వేసిన చివరి ఓవర్లో 4, 6 , 6 తో అర్ధ శతకం సాధించిన స్టోయినిస్ చివరి రెండు బంతుల్నీ బౌండరీ దాటించాడు. దాంతో, పంజాబ్ నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 222 పరుగులు చేసింది.

## కోహ్లీ మోస్ట్ ఎమోషనల్ మూమెంట్..

డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో రాయల్ ఛాలెంజర్స్ బెంగ ళూరు ఈ సీజన్‌లోనూ దుమ్ములేపుతోంది. 7 మ్యాచ్‌ల్లో ఐదు విజయాలు సాధించిన ఆర్‌సీబీ.. 10 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. నేడు ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడుతోంది. 18 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఐపీఎల్ ఛాంపియన్‌గా నిలిచిన తరువాత విరాట్ కోహ్లీ తొలిసారి తన సొంత మైదానం ఢిల్లీలో ఆడనున్నాడు. తన కెరీర్‌లో తొలిసారిగా ఐపీఎల్ ట్రోఫీని అందుకున్నప్పుడు కోహ్లీ ఎలా ఉన్నాడో ఆర్‌సీబీ ఆల్‌రౌండర్ కృనాల్ పాండ్యా వెల్లడించాడు. జియోస్టార్ 'ది కృనాల్ పాండ్యా ఎక్స్‌పీరియన్స్'లో మాట్లాడుతూ.. ట్రోఫీకి అత్యంత అర్హుడు విరాట్ కోహ్లీ, ఆర్‌సీబీ అభిమానులు అని అన్నాడు. మొదటి సీజన్ నుంచి విరాట్ కోహ్లీ ఆర్‌సీబీ టీమ్‌లో అంతర్భాగం అయయాడని.. ట్రోఫీ గెలిచినప్పుడు భావోద్వేగానికి గురికావడం చూడటం చాలా ప్రత్యేకమైనదని అన్నాడు. విరాట్ కోహ్లీ ఏడవడం చూడటం.. మీరు అభిమాని అయినా లేదా జట్టులో భాగమైనా.. ప్రతిఒక్కరికీ ఒక భావోద్వేగ క్షణం. చెన్నైతో ఆడి బస్సులో బయటకు వెళ్తున్నప్పుడు ఆర్‌సీబీ ప్రజలకు ఎంతో ప్రేమ ఉందో చూశా.. ఆ రోజు నేను అభిమానుల కోసం మనం తప్పకుండా కప్ గెలవాలని చెప్పాను. నేను ఆ మాట అన్నందుకు.. ఫైనల్‌లో గెలిచి మేము కల నెరవేర్చగలిగినందుకు సంతోషంగా ఉంది. ఈ ట్రోఫీకి అందరికంటే ఎక్కువగా అభిమానులే అర్హులు.. అలాగే విరాట్ కూడా. విజేతగా నిలవడంతో భాగమై.. చిన్న విధంగానైనా నా వంతు సహకారం అందించినందుకు నేను కృతజ్ఞుడను. నాకు దేశం కోసం ఆడటమే ప్రథమం. కానీ 18 ఏళ్ల తర్వాత ఆర్‌సీబీ కోసం గెలవడం.. జట్టుకు చక్కగా సహకరిస్తూ నా అత్యుత్తమ సీజన్‌ను సొంతం చేసుకోవడం నా జీవితంలోని అత్యుత్తమ క్షణాలలో ఒకటిగా నిలుస్తుంది." అని కృనాల్ పాండ్యా చెప్పుకొచ్చాడు.